ప్రత్యేక రాష్ట్రాన్ని, ప్రత్యేక హైకోర్టును ఎలా సాధించామో..?




PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

కాకతీయ ప్రభుత్వ కళాశాలలో "ప్రోగ్రామింగ్ ఎసెన్షియల్స్ ఇన్ పైథాన్" కార్యక్రమం విజయవంతం




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 40 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శుక్రవారం 06 ఫిబ్రవరి 2026


## వికసిత్ భారత్ లక్ష్యం దిశగా

# దేశం పరుగులు

- ● రీఫార్మ్.. పెర్ఫార్మ్.. ట్రాన్స్‌ఫార్మ్ దిశగా భారత్
- ● ప్రపంచంలో భారత్ పరపతి పెరుగుతోంది
- ● 9 దేశాలతో ట్రేడ్ డీల్ చేసుకుంటున్నాం
- ● ఎక్స్‌ప్రెస్ వేగంతో సంస్కరణల అమలు
- ● దేశ ప్రగతి సాధనలో వెనకడుగు వేసేది లేదు
- ● మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ స్థానం
- ● కాంగ్రెస్‌కు దూరదృష్టి లేదు..ఓట్ బ్యాంక్ రాజకీయాలు
- ● రాష్ట్రపతి ధన్యవాద తీర్మానంపై రాజ్యసభలో మోడీ
- ● విపక్షాల నిరసనల...నినాదాలు..చివరకు వాకౌట్



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 5 (పిసిడబ్ల్యూ న్యూస్):** వికసిత్ భారత్ లక్ష్యం దిశగా దేశం ప్రస్తుతం దూసుకెళుతోందని ప్రధాని మోదీ అన్నారు. ప్రస్తుతం అన్ని జీవిత పార్శ్వాల్లో, వర్గాల్లో మార్పులు కనిపిస్తున్నా యని అన్నారు. సరైన దిశలో దేశం ముందుకు సాగుతోందని అన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బ్జడెట్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధాని మోదీ రాజ్యసభలో ప్రసంగించారు. విపక్ష నేతల నిరసనలు, నినాదాల నడుమ ప్రధాని ప్రసంగించారు. ఆ తరువాత కొద్ది సేపటికే విపక్షాలు వాకౌట్ చేశాయి. అయితే, ప్రధాని మాత్రం తన ప్రసంగాన్ని కొనసాగించారు. స్వాతంత్ర్యం తొలి నాళ్లల్లో మిగతా2లో...

## ప్రజాపాలన అందిస్తుంటే

# విషం చిమ్ముతున్నారు

- ● ఓ కుటుంబం మొత్తం ప్రభుత్వం పడిపోవాలని చూస్తోంది
- ● అభివృద్ధి పనులకు రెండేళ్లలో రూ.17,442 కోట్లు ఖర్చు చేశాం
- ● ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ఇచ్చిన ఘనత సోనియమ్మది
- ● పదేళ్లలో బిఆర్ఎస్ పేదలకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదు
- ● బిజెపి అధ్యక్షుడు పాలమూరుకు వచ్చి హామీలపై మాట్లాడలేదు
- ● బిజెపికి ఈ ఎన్నికల్లో ఒక్కసీటు కూడా రాకుండా చేస్తాం
- ● కరీంనగర్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో సిఎం రేవంత్
- ● పార్టీ అభ్యర్థులు క్షేత్రస్థాయిలో కలసి పనిచేయాలని హితవు



**కరీంనగర్,ఫిబ్రవరి 5 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజా ప్రభుత్వం ఏర్పడి ప్రజాపాలన అందిస్తుంటే కొందరు విషం చిమ్ముతున్నారని సిఎం రేవంత్ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం దిగిపోవాలని కుటుంబం మొత్తం దాడికి దిగుతోందని పరోక్షంగా కెసిఆర్ కుటుంబంపై ఆరోపణలు చేశారు. తెలంగాణలో 123 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్లలో అభివృద్ధి పనులకు రెండేళ్లలో రూ. 17,442 కోట్లు ఖర్చు చేశామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్ జిల్లా గుమ్లాపూర్‌లో పర్యటించిన సీఎం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గుమ్లాపూర్‌లో ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు. తెలంగాణ ఏర్పాటు చేస్తామని సోనియాగాంధీ కరీంనగర్ గడ్డపై నుంచి మాట ఇచ్చారు. ఏపీలో పార్టీ అధికారం కోల్పోయినా మాట తప్పకుండా తెలంగాణ ఇచ్చారు. తెలంగాణను కాంగ్రెస్ ఇచ్చినా.. బీఆర్ఎస్‌కు మిగతా2లో...

## మేడారంలో అత్యాచారం

# ఘటన అబద్ధం

- తేల్చి చెప్పిన జాతీయ మహిళా కమిషన్



**ములుగు,ఫిబ్రవరి 5 (పిసిడబ్ల్యూ న్యూస్):** మేడారం జాతరలో బాలికపై సామూహిక అత్యాచారం జరగలేదని జాతీయ మహిళా కమిషన్ ఎంక్వయిరీ మిగతా2లో...

## భగవంతుడిపైనా పగబట్టిన

# వైసిపి

- వైసిపి హయాంలో వరుసబెట్టి హిందుత్వంపై దాడులు
- ఆలయాలు ధ్వంసం...రథం దగ్ధం..ఆభరణాల చోరీ
- సిట్ నివేదికలో వైసిపికి ఎక్కడా క్లీన్‌చిట్ ఇవ్వలేదు
- మీడియా సమావేశంలో పవన్ కళ్యాణ్ ఆగ్రహం



**అమరావతి, 5 (పిసిడబ్ల్యూ న్యూస్):** తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీ విషయంపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. సున్నిత అంశాలపై చాలా ఆలోచించి మాట్లాడాలని తెలిపారు. సిట్ నివేదికను సీఎం చంద్రబాబు తమకు చదివి వినిపించారని ప్రస్తావించారు. జంతువుల కొవ్వు మిగతా2లో...

## మేఘాలయలో

# అక్రమ బొగ్గు తవ్వకాలు

- పేలుడు ఘటనలో 16మంది దుర్మరణం




## అందుబాటులోకి

# భారత్ ట్యాక్సీ

- యాప్‌ను ప్రారంభించిన అమిత్ షా




## పదేళ్ల బిఆర్ఎస్ అభివృద్ధి...

# రెండేళ్ల కాంగ్రెస్ దోఖా పనులు

- తులం బంగారం వచ్చినోళ్లు కాంగ్రెస్‌కు ఓటేయండి
- సిరిసిల్ల ప్రచారంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్



**రాజన్న సిరిసిల్ల,ఫిబ్రవరి 5 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రధాన పార్టీలకు చెందిన కీలక నేతలు ప్రచారంలో ఫుల్ బిజీగా ఉన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం బివైనగర్ లో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత కేటీఆర్ పాల్గొన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే సిరిసిల్ల జిల్లాను తీసేస్తారని మిగతా2లో...

## పన్నెండేళ్లుగా తెలంగాణలో

# బానిస ప్రభుత్వాలు

- పదేళ్ల బిఆర్ఎస్,రెండేళ్ల కాంగ్రెస్‌తో ఒరింగింది శూన్యం
- మజ్లిస్ కనుసన్నల్లోనే రెండు ప్రభుత్వాల పాలన
- మద్యం ఆదాయం...భూముల అమ్మకం ఇదే పాలసీనా
- రేవంత్ సర్కార్‌పై ఘాటు విమర్శలు చేసిన కిషన్ రెడ్డి



**హైదరాబాద్,ఫిబ్రవరి 5 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణను రక్షించుకోవాలంటే బీజేపీకి ఓటు వేయాలని ప్రజలకు కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి సూచించారు. పన్నెండు ఏళ్లుగా తెలంగాణలో బానిస ప్రభుత్వాలు నడుపుతున్నారని విమర్శించారు. మజ్లిస్ కనుసన్నల్లో బీఆర్ఎస్ పదేళ్ల బానిస పాలన చేస్తే.. కాంగ్రెస్ పార్టీ సైతం మజ్లిస్ ఓట్ల కోసం బానిస పాలన చేస్తుందంటూ మండిపడ్డారు. గురువారం హైదరాబాద్‌లో కిషన్ రెడ్డి మిగతా2లో...



## గ్రూప్-1 ఉద్యోగులకు

# ఊరట

- సింగిల్ బెంచ్ తీర్పును రద్దు చేసిన ధర్మాసనం

**హైదరాబాద్,ఫిబ్రవరి 5 (పిసిడబ్ల్యూ న్యూస్):** గ్రూప్ 1 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు తెలంగాణ హైకోర్టు ఊరట కల్పించింది. గ్రూప్ 1 నియామకాల వ్యవహారంలో సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును రద్దు

మిగతా2లో

## బిజెపిని గెలిపిస్తే

# దండిగా నిధులు

- ప్రచారంలో హామీలు గుప్పించిన బండి



# వికసిత్ భారత్ లక్ష్యం దిశగా దేశం పరుగులు

(మొదటి పేజీ తరువాయి)

భారత్ ప్రపంచంలో 6వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉండేదని అన్నారు. కానీ, మునుపటి ప్రభుత్వాల విధానాల కారణంగా 2014 నాటికి 11వ స్థానికి పడిపోయిందని అన్నారు. ప్రపంచంలో భారత్ పరపతి పెరుగుతోందని అన్నారు. ఈయూ సహా 27 దేశాలతో భారత్ అనేక ఒప్పందాలు చేసుకుందని గుర్తు చేశారు. 9 దేశాలతో ట్రేడ్ డీల్ చేసుకుంటున్నామని చెప్పారు. రీఫార్మ్.. పెర్ఫార్మ్.. ట్రాన్స్‌ఫార్మ్ దిశగా భారత్ సాగుతోందని అన్నారు. ఉత్పత్తి రంగంలో అనేక విజయాలు సాధించామని చెప్పారు. ఎక్స్‌ప్రెస్ వేగంతో సంస్కరణలను తమ ప్రభుత్వం అమలు చేస్తోందని అన్నారు. భారత్‌లో ప్రతిభావంతమైన యువతకు కొరత లేదని వ్యాఖ్యానించారు. రానున్న 25 ఏళ్లు భారత్‌కు అత్యంత కీలకమని వ్యాఖ్యానించారు. దేశ ప్రగతి సాధనలో వెనకడుగు వేసేది లేదని కూడా తేల్చి చెప్పారు. ఒకప్పుడు భారత్ బలహీనమైన ఐదు ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఉండేదని అన్నారు. ప్రస్తుతం మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతోందని చెప్పారు. ప్రపంచ సవాళ్లకు భారత్ పరిష్కారాలు చూపించే స్థితిలో నిలిచి ఒక ఆశాకిరణంగా మారిందని అన్నారు. అధిక వృద్ధి రేటు, తక్కువ ద్రవ్యోల్బణం కలగలిసిన అరుదైన స్థితిలో భారత్ ఉందని అన్నారు. మునుపటి ప్రభుత్వాల తప్పులను సరిచేసేందుకే అధిక శాతం తమ శక్తియుక్తులను వినియోగించాల్సి వస్తోందని అన్నారు. గత ప్రభుత్వాల కారణంగా మూటగట్టుకున్న ప్రతికూల అభిప్రాయాన్ని తొలగించుకుంటున్నామని అన్నారు. ఈ నష్టాన్ని సరిచేసేలా భవిష్యత్తుకు తగిన విధానాలతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. గ్లోబల్ సౌత్‌గా పేరు పడ్డ దేశాల తరపున భారత్ అంతర్జాతీయ వేదికలపై బలంగా తన వాణిని వినిపిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. ప్రపంచదేశాలకు విశ్వసనీయ భాగస్వామిగా భారత్ అవతరించిందని చెప్పారు. కాంగ్రెస్‌కు దార్శనికత లేదని విమర్శించారు. ఫలితంగా భారత్ చాలా కాలం పాటు కష్టాలు పడిందన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగా వ్యవస్థలు బలహీనపడతాయని అన్నారు. ప్రపంచంలో అగ్రగామి దేశాలు భారత్‌తో వాణిజ్య ఒప్పందాల కోసం ఉత్సుకతతో ఉన్నాయని చెప్పారు. ఈయూ ట్రేడ్ డీల్‌తో ప్రపంచంలో స్థిరత్వంపై వివిధ దేశాలకు నమ్మకం పెరిగిందని అన్నారు. అమెరికాతో ఒప్పందంతో ఈ భావన మరింత బలపడిందని వ్యాఖ్యానించారు. ఇకపోతే కాంగ్రెస్‌పై ప్రధాని మోదీతీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ పార్టీకి దూరదృష్టి, ఎటువంటి ప్రణాళిక లేదన్నారు. తనతోపాటు ఓ వర్గంపైనా ద్వేషాన్ని పెంచుకుంటోం దన్నారు. ఇటీవల లోక్‌సభలో చోటుచేసుకున్న పరిణామాలు తనను తీవ్రంగా బాధించాయన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాజ్యసభలో ప్రసంగించిన ప్రధాని మోదీ..

# ప్రజాపాలన అందిస్తుంటే విషం చిమ్ముతున్నారు

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలు పట్టం కట్టారు. ప్రజా తీర్పును కాంగ్రెస్ పార్టీ శిరసావహించింది. పదేళ్లలో పన్నుల రూపంలో రూ.20లక్షల కోట్లు ప్రజలు ప్రభుత్వానికి కట్టారు. కానీ, పదేళ్లలో పేదలకు రెండు పడక గదుల ఇళ్లు కూడా కట్టించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంలో మున్సిపల్ ఎన్నికలు వచ్చాయి. పాలమూరు జిల్లాలో మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి భాజపా జాతీయ అధ్యక్షుడిని తీసుకొచ్చారు. కాళేశ్వరం, పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇవ్వలేదు, మెట్రో రైలు మంజూరు చేయలేదు..మూసీకి నిధులు ఇవ్వలేదు. రీజినల్ రింగ్‌రోడ్డు పూర్తి చేస్తామని చెప్పలేదు. ఇవేమీ ఇవ్వకుండా భాజపా జాతీయ అధ్యక్షుడిని ఎందుకు తీసుకొచ్చారని ప్రశ్నించారు. దేశంలోని భాజపా అగ్రనేతలందరినీ ఎన్నికల ప్రచారానికి తీసుకొచ్చినా ఒక్క మున్సిపాలిటీ అయినా గెలుస్తారా? కాంగ్రెస్ సత్తా ఏంటో భాజపాకు చూపిస్తాం అని రేవంత్ అన్నారు. భాజపా, బీఆర్ఎస్ బంధం ఫెవికాల్ బంధం కాదా?. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అవయవదానం చేసింది. ఓట్లు, సీట్లు దానం చేసి 8 చోట్ల భాజపా ఎంపీలను గెలిపించారు. 8 చోట్ల డిపాజిట్లు కోల్పోయినా తామే గెలుస్తామని బీఆర్ఎస్ రంకెలేస్తోంది. బీఆర్ఎస్ రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం..మూడేళ్లలోనూ కూలేశ్వరం అయింది. కాళేశ్వరాన్ని బీఆర్ఎస్ ఏటీఎంలా వాడుకుందని మోదీ, అమిత్ షా స్వయంగా చెప్పారు. కానీ, కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరిపించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి పంపిస్తే.. ఇప్పటి వరకు కేంద్రం స్పందించలేదు. దీనిపై కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలని సీఎం డిమాండ్ చేశారు. రాజకీయాల్లో డబ్బులతో కాదు.. నమ్మకంతోనే గెలుస్తామని మున్సిపల్ ఎన్నికల బరిలో దిగిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. 'ప్రజలకు నమ్మకం కలిగించండి.. అదొక్కటే మిమ్మల్ని గెలిపిస్తుంది' అని వారికి స్పష్టం చేశారు. గురువారం నాడు కరీంనగర్‌లో మున్సిపల్ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారితో ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ.. ఇవి కార్యకర్తల ఎన్నికలని తెలిపారు. కార్యకర్తలకు సముచిత స్థానం ఇచ్చినప్పుడే పార్టీ బలపడుతుందని పేర్కొన్నారు. ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని నేతలకు ఆయన సూచించారు. అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లల్లో ఎన్నో సంక్షేమ పథకాలను అందించామని.. ఇంకా చేయాల్సింది ఎంతో ఉందన్నారు రేవంత్ రెడ్డి. అయితే అధికార పార్టీలో టికెట్ ఆశించే వాళ్లు ఎక్కువగా ఉండటం సహజమని.. ఎంతో మంది పోటీ పడ్డా.. కాంగ్రెస్ పార్టీ బీఫామ్ దక్కడం మీ అదృష్టమని అభ్యర్థులకు సోదాహరణగా వివరించారు. ఒక్క ఓటు.. గెలుపు ఓటములను నిర్ణయిస్తుందని సీఎం రేవంత్ పేర్కొన్నారు. టికెట్ రాని వారిని కూడా సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలంటూ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థలకు దిశానిర్దేశర చేశారు ముఖ్యమంత్రి. పదేళ్ల పాలనలో గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వకపోయినా మన ప్రభుత్వంలో అర్హులందరికీ రేషన్ కార్డులు అందించామని చెప్పుకొచ్చారు. పేదలకు సన్న బియ్యం.. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించామని వివరించారు. మహిళా గ్రూపులకు సున్నా వడ్డీ రుణాలు అందించామని పేర్కొన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించామన్నారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని చెప్పారు. పట్టణ ప్రాంతాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలతోపాటు వాటి వల్ల చేకూరిన లబ్దిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని మున్సిపల్ అభ్యర్థులకు స్పష్టం చేశారు.

# భగవంతుడిపైనా పగబట్టిన వైసిపి

(మొదటి పేజీ తరువాయి)

కలిసిందని చెప్పడం చాలా సున్నిత అంశమని పేర్కొన్నారు. మాట్లాడేటప్పుడు పర్యవసానాలు ఆలోచించే ముందుకెళ్తామని చెప్పుకొచ్చారు. సీఎం చంద్రబాబు నివాసంలో భేటీ అనంతరం పవన్ కల్యాణ్ మీడియాతో మాట్లాడారు. ఐదేళ్లు తామే అధికారంలో ఉంటామని.. రాజకీయ లబ్ది కోసం మాట్లాడాల్సిన అవసరం ఏముందని పవన్ ప్రశ్నించారు. భగవంతుడిపైనా వైసీపీ పగబట్టిందని ధ్వజమెత్తారు. అందరం ఏడు కొండలు అంటామని.. వైసీపీ వాళ్లు రెండు కొండలు అంటారని అన్నారు. వైసీపీ హయాంలో హిందూ మతంపై చాలా దాడులు జరిగాయని ఆరోపణలు చేశారు. రామతీర్థంలో శ్రీరామచంద్రుడి విగ్రహం ధ్వంసం చేశారని ఫైర్ అయ్యారు. దుర్గమ్మ ఆలయంలో చోరీ జరిగితే.. ఇవి పోతే ఇంకొకటి కొందామన్నారని చెప్పుకొచ్చారు. అంతర్వేదిలో రథం కాలిపోతే ఎవరో పిచ్చివారు చేశారని చెప్పారన్నారు. నెయ్యి కల్తీ అంశంలో మతాల ప్రస్తావన లేదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. 'తప్పు చేసి క్షమాపణ అడగకుండా మమ్మల్నే క్షమాపణ అడుగుతున్నారు. శ్రీవారి విషయంలో తప్పుచేసిన వారు నాశనమైపోతారు. సిట్ రిపోర్ట్ ఎక్కడా వైసీపీకి క్లీన్‌చిట్ ఇవ్వలేదన్నారు. రిపోర్ట్‌లో జంతువుల కొవ్వు ఉందని స్పష్టంగా ఉంది. భగవంతుడితో పెట్టుకున్నవారు సర్వనాశనం అయిపోతారు తప్ప బతికున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా చేసిన మహాపాపానికి దేవుడిని క్షమాపణ కోరుకోవాలి. భగవంతుడికి మోకరిల్లే వరకూ విషయాన్ని వదిలిపెట్టం. హిందూ ధర్మాన్ని కాపాడే విషయంలో చాలా స్పష్టంగా ఉన్నాం. కల్తీ లడ్డూ వ్యవహారం ముమ్మాటికీ తెలిసి చేసిన నేరం. 2022లోనే కల్తీ నిర్ధారణ అయ్యింది. అయినా అయోధ్యకు అవే కల్తీ లడ్డూలు పంపి మహాపాపానికి ఒడిగట్టారు' అని పవన్ కల్యాణ్ ధ్వజమెత్తారు. కల్తీ లడ్డూ వ్యవహారంలో కళ్ల ముందు ఎన్నో వాస్తవాలు కనిపిస్తుంటే మాట్లాడకపోవటం సబబు కాదని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. 'అన్ని నివేదికలు.. ప్రసాదంలో వాడిన పదార్థాల్లో నెయ్యి లేదని నిర్ధారించాయి. ఎన్డీడీబీ జంతుకొవ్వు అవశేషాలు నిర్ధారిస్తే, తమ వద్ద అలాంటి పరీక్ష చేసే సామర్థ్యం లేదని ఎన్డీఆర్ఐ చెప్పింది. ప్రతీమాట భక్తుల మనోభావాలు, సెంటిమెంటును దృష్టిలో పెట్టుకునే మాట్లాడుతున్నాం. దేవుడి విషయాన్ని రాజకీయం చేయకూడదనే నిష్ఠతో వ్యవహరిస్తూ వస్తున్నాం. ప్రజలకు వాస్తవాలు చెప్పకుంటే అది ఇంకా పెద్ద తప్పు అవుతుందనే నిజాలు బయటపెడుతున్నాం. వైసీపీ హయాంలో పెద్దఎత్తున దేవాలయాలపై దాడులు జరిగితే ఎలాంటి చర్యలు తీసుకోలేదు' అని పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# పదేళ్ల బిఆర్ఎస్ అభివృద్ధి... రెండేళ్ల కాంగ్రెస్ దోఖా పనులు

(మొదటి పేజీ తరువాయి)

ఆయన విమర్శించారు. 'ఓవైపు అభివృద్ధి చేసిన బీఆర్ఎస్, మరోవైపు ఇచ్చిన హామీలు మరచిన కాంగ్రెస్, ఎప్పుడో ఒకసారి దేవుని పేరు చెప్పుకుని వచ్చే బీజేపీ పార్టీలు ఉన్నాయి. ఎవరికి ఓటు వేయ్యాలో మీరే నిర్ణయించుకోవాలి' అని కేటీఆర్ అన్నారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో ప్రధాన పోటీ గత పదేళ్లలో ప్రజల కోసం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన బీఆర్ఎస్ పార్టీకి, గడిచిన రెండేళ్లలో ఉన్న సంక్షేమ పథకాలను ఎత్తివేసిన కాంగ్రెస్ పార్టీకి మధ్య ఉన్నదని కేటీఆర్ చెప్పారు. మరోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేస్తేనే తగిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు తిరిగి ప్రారంభమవుతాయని, ఆ దిశగా ఈ మున్సిపల్ ఎన్నికలతోనే కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేసుకునే కార్యక్రమం ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీని గనుక ఈ మున్సిపల్ ఎన్నికల్లో నిలదీయకుంటే, ఇచ్చిన హామీల మోసంపైన ప్రశ్నించకుంటే, మరో మూడు సంవత్సరాల దాకా అంటే శాసనసభ ఎన్నికల వరకు ప్రజలకి ప్రభుత్వాన్ని, కాంగ్రెస్ పార్టీని ప్రశ్నించే అధికారం, అవకాశం రాదని చెప్పారు. ఇప్పుడు గనుక ప్రభుత్వానికి ఒక హెచ్చరిక చేసేలా సురుకు పెట్టకుంటే కాంగ్రెస్ పార్టీ తన మోసాలను కొనసాగిస్తుందని అన్నారు. కాంగ్రెస్ వాళ్లు తులం బంగారం ఇస్తానన్నారు. కానీ, వాళ్లు ఉన్న పుస్తెలు ఎత్తుకు పోయే రకం. నాపై కోపంతో బతుకమ్మ చీరలు బంద్ చేశారు. నేతన్నల బతుకుదెరువుపై దెబ్బ కొట్టారు. దేవుని గుడి వద్ద ఉండి అడుక్కుతినేవారిలాగా, దేవుని పేరుతో ఓట్లడుక్కోవడానికి మాత్రమే బీజేపీ వారే వస్తారు. అలానే కాంగ్రెస్ కు ఓటేస్తే సిరిసిల్ల జిల్లాను తీసేస్తారు. తులం బంగారం వచ్చిన వారు కాంగ్రెస్ కు ఓటెయ్యండి, రానివారు బీఆర్ఎస్‌కు ఓటెయ్యండి. సిరిసిల్ల బతుకుదెరువు లేకుండా చేసినోడికి, గట్టి బుద్ధి చెప్పాలి' అని కేటీఆర్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక వార్డుల ప్రజలను, పట్టణ ప్రజలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఇప్పటికే అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. మున్సిపల్ ఎన్నికల కోసం మరోసారి అబద్దాలు చెబతోందని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మళ్లీ కాంగ్రెస్ పార్టీ మాటలు నమ్మి ఓటువేస్తే.. మళ్లీ మోసపోవడం ఖాయం' అని కేటీఆర్ అన్నారు.

# మేడారంలో అత్యాచారం ఘటన అబద్ధం

(మొదటి పేజీ తరువాయి)

కమిటీ తేల్చి చెప్పింది. గురువారం మధ్యాహ్నం జాతీయ మహిళా కమిషన్ సభ్యులు డెలినా, కంచన్ కట్టర్ ఆధ్వర్యంలో విచారణ కమిటీ ములుగుకు చేరుకుంది. అనంతరం స్థానిక కలెక్టరేట్ లో కలెక్టర్ దివాకరం, ఎస్పీ రామ్‌నాథ్ కేకన్‌తో కమిటీ సమావేశమైంది. ఆ తర్వాత గ్యాంగ్ రేప్‌పై విచారణ చేపట్టింది. అలాగే ఈ ఘటన జరిగిందంటూ ఆరోపిస్తున్న ప్రదేశాన్ని సైతం కమిటీ సభ్యులతోపాటు జిల్లా ఉన్నతాధికారులు పరిశీలించారు. ఈ జాతరలో ఎలాంటి గ్యాంగ్ రేప్ ఘటన జరగలేదని సదరు కమిటీ ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చింది. దాంతో పోలీసుల నుంచి లిఖిత పూర్వక నివేదిక వచ్చాక.. జాతీయ మహిళా కమిషన్‌కు ఈ ఎంక్వయిరీ కమిటీ.. రిపోర్టును అందించనుంది. మేడారంలో జనవరి 28 నుంచి 31వ తేదీ వరకు సమ్మక్క-సారలమ్మ జాతర జరిగింది. ఈ జాతరలో బాలికపై సామూహిక అత్యాచారం జరిగిందంటూ సోషల్ మీడియాలో వార్త వైరల్ అయింది. మామిడితోటలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన పలువురు యువకులు వాష్ రూమ్‌కు వెళ్లిన బాలికపై అత్యాచారానికి పాల్పడినట్లు ప్రచారం జరిగింది. అనంతరం ఈ ఘటనకు కారణమైన యువకులు జంపన్నవాగు సమీపంలోని ఒక షాపులో దాక్కున్నారని.. వారిని పోలీసులు తీసుకువెళ్లినట్లు ఆ వార్త కథనంలో పేర్కొన్నారు. ఈ వార్తను ఇప్పటికే ములుగు ఎస్పీ రామ్‌నాథ్ సుధీర్ కేకర్ ఖండించారు. అలాంటి ఘటన ఏదీ చోటు చేసుకోలేదని స్పష్టం చేశారు. మరోవైపు ఈ ఘటనపై జాతీయ మహిళా కమిషన్ సీరియస్ అయింది. కమిషన్‌లోని సభ్యులతో విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ.. ములుగు వచ్చి వాస్తవ పరిస్థితులు పరిశీలించి.. కమిషన్‌కు నివేదిక అందజేయనుంది.

# మేఘాలయలో అక్రమ బొగ్గు తవ్వకాలు

● పేలుడు ఘటనలో 16మంది దుర్మరణం

**షిల్లాంగ్,ఫిబ్రవరి 5 (పిసిడబ్ల్యూ న్యూస్):** మేఘాలయ రాష్ట్రంలో అక్రమ బొగ్గు తవ్వకాలు మరోసారి భారీ ప్రాణ నష్టానికి కారణమయ్యాయి. తూర్పు జైంతియా హిల్స్ జిల్లాలోని ఓ గనిలో బొగ్గు తవ్వుతుండగా భారీ పేలుడు సంభవించింది. ఈ పేలుడు ధాటికి 16 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోగా.. ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు, రెస్క్యూ టీమ్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ గనిని అక్రమంగా నిర్వహిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే పేలుడికి గల కారణాలు మాత్రం ఇంకా తెలియరాలేదు. మేఘాలయలో ర్యాట్ హోల్ మైనింగ్, అశాస్త్రీయ పద్ధతుల్లో తవ్వకాలు జరుపుతున్నారు. అయితే, ఈ తవ్వకాలను 2014 నుంచి జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఔఉ÷) నిషేధించింది. ర్యాట్ హోల్ అంటే.. సమాంతరంగా సన్నని గుంత తవ్వుతూ బొగ్గును బయటకు వెలికి తీసే పద్ధతి. సుమారు 3, 4 అడుగుల వెడల్పుతో ఈ గుంతలు ఉంటాయి. అచ్చం ఎలుకలు బొరియలు తవ్వినట్టుగా ఉంటాయి కాబట్టి దీనికి 'ర్యాట్ హోల్ మైనింగ్' అనే పేరు వచ్చింది. ఇటీవల ఈ తవ్వకాలపై ఎన్జీటీ నిషేధాన్ని సుప్రీంకోర్టు కూడా సమర్థించింది.

# అందుబాటులోకి భారత్ ట్యాక్సీ

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 5 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రైవేటురంగ ట్యాక్సీ సంస్థలు ఓలా, ఉబర్, ర్యాపిడోకు పోటీగా కేంద్ర ప్రభుత్వం భారత్ ట్యాక్సీ పేరిట కొత్త యాప్‌ను తీసుకొచ్చింది. కేంద్రమంత్రి అమిత్ షా గురువారం ఈ యాప్‌ను ప్రారంభించారు. ప్రయోగాత్మకంగా చేపట్టిన సేవలు విజయవంతమైన నేపథ్యంలో ఎట్టకేలకు అందుబాటులోకి తెచ్చారు. తొలుత దిల్లీ-రాజధాని ప్రాంతం, గుజరాత్ రాష్ట్రాల్లో సేవలు లభిస్తాయి. రాబోయే మూడేళ్లలో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, ద్వారక నుంచి కామాఖ్య వరకు భారత్ ట్యాక్సీ సేవలను తీసుకొస్తామని అమిత్‌షా పేర్కొన్నారు. ఇందులో లాభాలు డ్రైవర్లకే వెళతాయని చెప్పారు. ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా కార్లు, త్రీవీలర్లు, టూవీలర్లు బుక్ చేసుకోవచ్చని తెలిపారు. దేశంలో క్యాబ్ బుకింగ్ సేవల్లో ఉబర్, ఓలా, ర్యాపిడో వంటి సంస్థలు కీలక భూమిక పోషిస్తున్నాయి. డ్రైవర్ల నుంచి ఆయా సంస్థలు కొంతమొత్తం కమిషన్‌గా వసూలు చేస్తున్నాయి. వారి శ్రమను ఆయా కంపెనీలు దోచుకుంటున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మల్టీ స్టేట్ కోపరేటివ్ సొసైటీస్ యాక్ట్ కింద 2025 జూన్ 5న 'భారత్ ట్యాక్సీ'కి కేంద్రం రూపకల్పన చేసింది. జీరో కమిషన్, సర్జ్‌ప్రైసింగ్ లేని విధానం, డ్రైవర్లకు లాభాలు పంచిపెట్టడం దీని ముఖ్య ఉద్దేశం. దిల్లీ-ఎన్‌సీఆర్, గుజరాత్‌లో డిసెంబర్ 2 నుంచి ప్రయోగాత్మకంగా సేవలందిస్తున్నారు. ఇప్పటి వరకు 3 లక్షల డ్రైవర్లు ఇందులో చేరగా.. లక్ష మంది యూజర్లు రిజిస్టర్ అయ్యారు. రోజుకు 10 వేల రైడ్లు జరిగాయి. సుమారు రూ.10 కోట్లను డ్రైవర్లకు లాభాలుగా అందినట్లు కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ పేర్కొంది. డ్రైవర్లకు 'సారథి' పేరిట ఆరోగ్య, ప్రమాద బీమా, రిటైర్మెంట్ సేవింగ్స్ కూడా లభిస్తాయి.

# గ్రూప్-1 ఉద్యోగులకు ఊరట

(మొదటి పేజీ తరువాయి)

చేస్తూ చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని ధర్మాసనం తీర్పు వెలువరించింది. గతంలో.. గ్రూప్ 1 నియామకాలపై విచారణ చేపట్టిన సింగిల్ బెంచ్ ధర్మాసనం.. జనరల్ ర్యాంకింగ్ లిస్టును రద్దు చేస్తూ కీలక ఆదేశాలు జారీ చేశారు. అలాగే మెయిన్స్ పరీక్ష జవాబు పత్రాలను పునః మూల్యాంకనం చేయాలని నాడు న్యాయమూర్తి ఆదేశించారు. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ టీజీపీఎస్సీతో పాటు ఇప్పటికే ఎంపికైన అభ్యర్థులు హైకోర్టులో పిల్ వేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి.. సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును కొట్టివేస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. తుది తీర్పునకు లోబడి గ్రూప్ 1 నియామకాలు చేపట్టవచ్చని ఇప్పటికే గతంలో ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే. ఆ ఉత్తర్వుల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 562 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేసింది.

# బిజెపిని గెలిపిస్తే దండిగా నిధులు

**కరీంనగర్,ఫిబ్రవరి 5(పిసిడబ్ల్యూ న్యూస్):** మున్సిపాలిటీల్లో బిజెపిని గెలిపిస్తే నిధుల వరద పారిస్తానని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. మున్సిపాలిటీలకు వచ్చేది కేంద్ర నిధులేనని అన్నారు. గ్రామ పంచాయతీలకు ఇప్పటికే కేంద్రం రూ.259 కోట్లు విడుదల చేసిందని, మున్సిపల్ ఎన్నికల్లో భాజపాని గెలిపిస్తే మొదటి విడతగా తెలంగాణకు రూ.500 కోట్లు తీసుకొస్తామని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. హుజూరాబాద్ సూపర్ బజార్ చౌరస్తాలో గురువారం నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. కేంద్రం నుంచి అభివృద్ధి పనుల కోసం రూ.వందల కోట్లు తీసుకొచ్చాం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని పరికరాలు తీసుకొస్తే రాష్ట్ర ప్రభుత్వం సరైన సిబ్బందిని నియమించట్లేదు. గత పదేళ్ల నుంచి హుజూరాబాద్ అభివృద్ధి చెందలేదు. కాంగ్రెస్‌గతంలో ఇచ్చిన హామీలు అమలు నెరవేర్చిందా? ఈ ప్రభుత్వం హుజూరాబాద్ మున్సిపల్ అభివృద్ధికి ఒక్కపైసా ఇవ్వలేదు. ఈ ఎన్నికల్లో భాజపాను గెలిపిస్తే ఇక్కడ మినీ స్టేడియం నిర్మిస్తాం. కాంగ్రెస్‌ను గెలిపిస్తే అన్ని ట్యాక్సులు పెంచుతారు. మేం దిల్లీ నుంచి నిధులు తీసుకొచ్చి హుజూరాబాద్‌ను అభివృద్ధి చేయిస్తామని కేంద్ర మంత్రి బండి అన్నారు.

# పన్నెండేళ్లుగా తెలంగాణాలో బానిస ప్రభుత్వాలు

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ..ప్రభుత్వ భూములను విక్రయించడం అభివృద్ధా? అంటూ ఈ రెండు పార్టీల నేతలను సూటిగా ప్రశ్నించారు. మద్యం, డ్రగ్స్‌తో కుటుంబాలు పతనం అవుతున్నా.. ఈ ప్రభుత్వానికి కావాల్సింది మాత్రం ఆర్థిక వనరులేనని కేంద్ర మంత్రి అన్నారు. భూములు అమ్మాలి.. అప్పులు చేయాలనేది కాంగ్రెస్ ప్రభుత్వ ఆలోచన అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు ధనిక రాష్టాన్ని అప్పుల పాలు చేశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ప్రజా ప్రభుత్వం కాదు.. అవినీతి, దోపిడి ప్రభుత్వమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అభివర్ణించారు. వీధి దీపాలు వెలిగించేందుకు డబ్బులు లేని దౌర్భాగ్య పరిస్థితిలో ఈ రాష్ట్ర ప్రభుత్వం ఉందని వ్యంగ్యంగా అన్నారు. పని చేసే పార్టీలకే ఓటు వేయాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగస్తులకు ఐదు డీఏలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయంటూ కిషన్ రెడ్డి సోదాహరణగా వివరించారు. ఇదా ప్రజా ప్రభుత్వమా.. పని చేసే ప్రభుత్వమా? సమాధానం చెప్పాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. పని చేసే ఏకైక పార్టీ బీజేపీ మాత్రమేనని ఆయన గుర్తు చేశారు. పొరుగునున్న ఆంధ్రప్రదేశ్‌లో అనేక విమానాశ్రయాలు ఉన్నాయని.. తెలంగాణలో ఎందుకు లేవని ఆయన రేవంత్ ప్రభుత్వాన్ని నిలదీశారు. గత పదేళ్లు ఏమీ చేశారంటూ బీఆర్ఎస్ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం.. కాంగ్రెస్ పార్టీకి బంగారు బాతు అయిందన్నారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా.. ఇక్కడి నుంచే నగదు పంపుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగుల బెనిఫిట్స్ మాత్రం ఇవ్వరన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ఓటు అడిగే నైతిక హక్కు లేదన్నారు. ఆర్ఆర్ ట్యాక్స్‌తో వ్యాపారస్తులు భయపడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మున్సిపాలిటీలకు ఎంత నగదు ఇచ్చారో సీఎం రేవంత్ రెడ్డి చెప్పాలని బల్లగుద్దీ మరి ప్రశ్నించారు. ఫిక్స్‌డ్ రేట్స్.. వన్ టైమ్ పేమెంట్‌ను ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పక్కగా కొనసాగిస్తుందని విమర్శించారు. గత 26 నెలల్లో ఏమీ చేసిందో చెప్పాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఇంటి అల్లుడి ఫోన్ ట్యాపింగ్ చేసిన దౌర్భాగ్య పరిస్థితి నెలకొందన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏమీ పీకారని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బాషలో అడుగుతున్నా నన్నారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచిన జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్ళారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గుర్తు చేశారు.

# కాకతీయ ప్రభుత్వ కళాశాలలో "ప్రోగ్రామింగ్ ఎసెన్షియల్స్ ఇన్ పైథాన్" కార్యక్రమం విజయవంతం





**హనుమకొండ : ఫిబ్రవరి 5 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాకతీయ ప్రభుత్వ కళాశాల (ఆటోనమస్), హనుమకొండలోని టీ-ఎస్-కే-సీ & ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో, తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) సహకారంతో నిర్వహించిన "ప్రోగ్రామింగ్ ఎసెన్షియల్స్ ఇన్ పైథాన్" మూడు రోజుల స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ఈరోజు విజయవంతంగా పూర్తయ్యింది.ఈ ముగింపు కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి. శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ, ఈ ప్రోగ్రామ్ ద్వారా విద్యార్థులు పొందిన స్కిల్స్‌ను సద్వినియోగం చేసుకుని తమ కెరీర్ అభివృద్ధికి ఉపయోగించుకోవాలని సూచించారు. పైథాన్‌పై అత్యుత్తమ సెషన్స్ నిర్వహించిన ట్రైనర్‌ను అభినందిస్తూ, ఇటువంటి స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ విద్యార్థుల జాబ్ అపర్చునిటీస్‌ను మెరుగుపరుస్తాయని తెలిపారు.ఈ సందర్భంగా టీ-ఎస్-కే-సీ కోఆర్డినేటర్ & ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డా. ఎ. అనిల్ కుమార్ మాట్లాడుతూ, మూడు రోజులలో విద్యార్థులు నేర్చుకున్న విషయాలను నిరంతరం ప్రాక్టీస్ చేయాలని సూచించారు. ఇంకా ఎక్కువగా నేర్చుకుని, అడ్వాన్స్ కాన్సెప్ట్‌లపై దృష్టి పెట్టి, జాబ్ మార్కెట్‌కు రెడీగా ఉండాలని అన్నారు. కంటిన్యూయస్ లెర్నింగ్ ద్వారానే కెరీర్ గ్రోత్ సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ డా. రజని లతలి కూడా ఈ సందర్భంగా మాట్లాడి, ఇటువంటి స్కిల్ ఓరియెంటెడ్ ప్రోగ్రామ్స్‌ను నిర్వహించిన టీ-ఎస్-కే-సీ & ప్లేస్‌మెంట్ సెల్‌ను అభినందించారు.తదనంతరం, ఆన్‌లైన్ గ్లోబల్ సర్టిఫికేషన్ కోర్సులను విజయవంతంగా పూర్తి చేసిన స్టూడెంట్స్‌కు సర్టిఫికేట్స్ పంపిణీ చేశారు. ఈ ప్రోగ్రామ్‌లో ఐ-క్యూ-ఏ-సీ కోఆర్డినేటర్ డా. ఎ. శ్రీనాథ్, టాస్క్ ట్రైనర్ శ్రీ జాఫర్, డా. శ్రీకాంత్, డా. ఎ. శ్రావణ కుమారి, డా. జి.కె. కుమార్, డా. నరహరి, టీ-ఎస్-కే-సీ మెంటర్ సాగర్, ఇతర ఫ్యాకల్టీ మెంబర్స్ మరియు స్టూడెంట్స్ పాల్గొన్నారు.

---

# ప్రచారంలో దూసుకెళ్లిన బొచ్చు చిన్ని కృష్ణ

**ఏనుగు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేసిన 1 వార్డు బిఎస్పీ అభ్యర్థి బొచ్చు చిన్ని కృష్ణ**

**పరకాల, ఫిబ్రవరి 05 (పిసిడబ్ల్యూ న్యూస్) :**పరకాల మున్సిపల్ ఎన్నికల వేడి తారాస్థాయికి చేరింది. ముఖ్యంగా 1వ వార్డులో బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అభ్యర్థి బొచ్చు చిన్ని కృష్ణ తన ప్రచారాన్ని ముమ్మరం చేస్తూ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. ప్రచారంలో భాగంగా ఆయన ఇంటింటికీ తిరుగుతూ, వార్డు అభివృద్ధికి తనకున్న ప్రణాళికలను వివరిస్తున్నారు. ఈ సందర్భంగా చిన్ని కృష్ణ ప్రచారంలో కనిపించిన ముఖ్యాంశాలు ఇక్కడ ఉన్నాయిజన సమీకరణ భారీగా తరలివచ్చిన కార్యకర్తలు, మద్దతుదారులతో వార్డు అంతటా సందడి నెలకొంది. 'ఏనుగు' గుర్తుకే ఓటు వేయాలని ఆయన కోరుతున్నారు.స్థానిక సమస్యలపై హామీ: వార్డులో నెలకొన్న డ్రైనేజీ సమస్యలు, మంచినీటి కొరత, మరియు వీధి దీపాల వంటి మౌలిక వసతుల కల్పనే తన తొలి ప్రాధాన్యత అని ఆయన హామీ ఇచ్చారు.ప్రజలతో మమేకమౌతు సామాన్య ప్రజల కష్టాలను అడిగి తెలుసుకుంటూ, నిత్యం అందుబాటులో ఉండే నాయకుడిగా తనను గెలిపించాలని అభ్యర్థించారు. **ప్రత్యామ్నాయ రాజకీయం:** బహుజనుల రాజ్యాధికారం కోసం, సామాజిక న్యాయం కోసం బీఎస్పీని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల వాతావరణం1వ వార్డులో బీఎస్పీ అభ్యర్థి దూకుడు పెంచడంతో



మిగిలిన పార్టీల అభ్యర్థుల్లోనూ ఉత్కంఠ నెలకొంది. స్థానికంగా ఉన్న యువత, మహిళల మద్దతు తనకు మెండుగా ఉందని చిన్ని కృష్ణ ధీమా వ్యక్తం చేస్తున్నారు.

---

# ప్రత్యేక రాష్ట్రాన్ని, ప్రత్యేక హైకోర్టును ఎలా సాధించామో..?



- **న్యాయవాదుల ప్రత్యేక రక్షణ చట్టం వచ్చేంతవరకు పోరాడుతాం....**

**ఉమ్మడి వరంగల్,ఫిబ్రవరి 05 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ రాష్ట్రంలో న్యాయవాదులపై విచ్చలవిడి దాడులు దౌర్జన్యాలు హత్యలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని ఇప్పటికైనా న్యాయవ్యవస్థ, పాలకవర్గాలు మేల్కోవాల్సిన అవసరం తక్షణమే ఉన్నదని వరంగల్ హనుమకొండ ఉమ్మడి జిల్లాల బార్ అసోసియేషన్ కమిటీలు డిమాండ్ చేసాయి, రంగారెడ్డి



జిల్లా చేవెళ్ల న్యాయస్థానంలో న్యాయవాద వృత్తి కొనసాగిస్తున్న "స్వప్న" అనే మహిళ యువ న్యాయవాది హత్య కు గురికావడం సిగ్గుచేటని వారు దుయ్యబట్టారు న్యాయవాదులకు ప్రత్యేక రక్షణ చట్టం వచ్చేంతవరకు పోరాటానికి సిద్ధం కావాలని దేశవ్యాప్తంగా న్యాయ వాదులు ఐక్యం కావాలని వారు పిలుపునిచ్చారు, కోర్టు కార్యకలాపాలు ఒకరోజు బంద్ పాటించారు,ఈ కార్యక్రమంలో వరంగల్ హనుమ కొండ బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వలస సుధీర్ కుమార్, పులి సత్యనారా యణ, రామా కాంత్, కొత్త రవి తో పాటు బార్ కౌన్సిల్ సభ్యులు దుస్సా జనార్ధన్, మహిళా న్యాయవా దులు రేవూరి శశిరేఖ, జన్ను పద్మ అట్లూరి పద్మ, దాదాపు 300 మంది పైగా న్యాయవాదులు పాల్గొన్నారు.

---

# కాంగ్రెస్ ప్రచార హోరు.. ఏదులాపురంలో విజయ దిశగా అడుగులు!



**ఖమ్మం/ఏదులాపురం, ప్రతినిధి ఫిబ్రవరి 5 (పిసిడబ్ల్యూ న్యూస్):** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఏదులాపురం పట్టణం కాంగ్రెస్ జెండాలతో కిటకిటలాడింది. ప్రజల విశ్వాసాన్ని సొంతం చేసుకునే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ ప్రచారాన్ని ఉద్ధృతంగా కొనసాగిస్తోంది. గురువారం సాయంత్రం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 23, 30వ వార్డుల్లో నిర్వహించిన విస్తృత ప్రచార కార్యక్రమం ప్రజల నుంచి అపూర్వ స్పందనను పొందింది.పార్టీ రాష్ట్ర నాయకులు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి నేతృత్వంలో సాగిన ఈ ప్రచారంలో కాంగ్రెస్ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా నినాదాలు చేశారు.హోరెత్తిన రోడ్ షో.. అడుగడుగునా ప్రజల ఆదరణ23వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి పోకబత్తిని అనిత, 30వ వార్డు అభ్యర్థి కొట్టం శిరీషకు మద్దతుగా సత్యనారాయణపురం, వరంగల్ క్రాస్ రోడ్ సెంటర్లలో భారీ రోడ్ షో నిర్వహించారు. ప్రచార వాహనాలు, డప్పు కళాకారుల నినాదాలతో రోడ్ షో ఉత్సాహంగా కొనసాగింది.పొంగులేటి ప్రసాద్‌రెడ్డి గడపగడపకూ వెళ్లి ఓటర్లను కలుసుకుని కాంగ్రెస్ హామీలను వివరించారు. మహిళలు మంగళహారతులు ఇచ్చి అభ్యర్థులకు ఘన స్వాగతం పలకగా, యువత కాంగ్రెస్‌కు మద్దతుగా నినాదాలు చేశారు.అభివృద్ధే మా ధ్యేయం : పొంగులేటి ప్రసాద్‌రెడ్డిఈ సందర్భంగా ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. పట్టణాల సమగ్ర అభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ, పేదల సంక్షేమం సాధ్యం కావాలంటే కాంగ్రెస్ అభ్యర్థుల విజయం తప్పనిసరి అని ఆయన స్పష్టం చేశారు."అధికార పార్టీగా ఉన్న కాంగ్రెస్ అభ్యర్థులు గెలిస్తేనే ఏదులాపురం మున్సిపాలిటీకి వేగంగా నిధులు వస్తాయి, అభివృద్ధి పనులు జరుగుతాయి" అని ఆయన అన్నారు.కాంగ్రెస్‌కే ప్రజల మద్దతుఈ ప్రచారంలో కనిపించిన జనసందోహం, ప్రజల స్పందన కాంగ్రెస్‌కు పెరుగుతున్న ఆదరణకు నిదర్శనంగా నిలిచింది. ఏదులాపురంలో ఈసారి కాంగ్రెస్ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.



---

# బిఆర్ఎస్ అభ్యర్థి చిలువేరు సునీతను గెలిపించాలి

- **4వ వార్డు అభ్యర్థి చిలువేరు సునీత కారు గుర్తుకు ఓటు వేయాలి: మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి**





**పరకాల, ఫిబ్రవరి 05 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పరకాల మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో పరకాల పట్టణంలోని 4వ వార్డులో పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బిఆర్ఎస్ అభ్యర్థి చిలువేరు సునీత కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు.పరకాల పట్టణ అభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో బిఆర్ఎస్ పార్టీకి ప్రత్యేకమైన గుర్తింపు ఉందని ఆయన పేర్కొన్నారు.బిఆర్ఎస్ పాలనలో పరకాల మున్సిపాలిటీ అన్ని రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించిందని, అదే అభివృద్ధిని కొనసాగించాలంటే మున్సిపాలిటీ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థుల విజయం అత్యంత అవసరమని స్పష్టం చేశారు.ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేసే చిలువేరు సునీత కు 4వ వార్డు ప్రజలు పూర్తి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.ఈ ఇంటింటి ప్రచార కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సిపిఐ పార్టీ మండల కార్యదర్శి బండి నర్సయ్య కుటుంబాన్ని పరామర్శించిన సిపిఐ పార్టీ జిల్లా కమిటీ



**ములుగు జిల్లా, ఫిబ్రవరి 05 (పిసిడబ్ల్యూ న్యూస్) :**ములుగు జిల్లా కేంద్రంలోని వెంకటాపూర్ మండలంలో ములుగు జిల్లా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు సిపిఐ పార్టీ వెంకటాపూర్ మండల కార్యదర్శి బండి నర్సయ్య మాతృమూర్తి బండి సమ్మక్క మరణించగా వారి కుటుంబానికి సానుభూతి తెలుపుతూ పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులకు సానుభూతి సంతాపం వ్యక్తంచేసిన సిపిఐ పార్టీ జిల్లా కార్యధర్శ మల్లఖార్జున్ జిల్లా సహయ కార్యదర్శి జంపాల రవీందర్ జిల్లా కార్యవర్గ సభ్యులు యండి అంజద్ పాష ములుగు గోవిందరావుపేట మల్లంపల్లి తాడ్వాయి కార్యధర్శులు ముత్యాల రాజు వడి సారయ్య నాయకులు ఇంజం కొమురయ్య గుంజె శ్రీనివాస్ బోడ రమేష్ బుడిమె సదయ్య మర్రి స్వామి కొక్కుల రాజేందర్ మాతంగి శ్యామ్ సుందర్ మరియు తదితరులు పాల్గొన్నారు

# మేడారం జంపన్నవాగులో అనుమానాల అలజడి

- **ఒకే కాంట్రాక్టర్‌కే కోట్ల పనులా? పాత సామగ్రిని కొత్తదిగా చూపిస్తున్నారా?**
- **విరాళంగా వచ్చిన మోటార్లపై సందేహాలు సమగ్ర విచారణ కోరుతున్న భక్తులు**





**ములుగు జిల్లా, ఫిబ్రవరి 05 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ములుగు జిల్లా మేడారంలో ఆసియాలోనే అతిపెద్ద ఆదివాసీ జాతరగా పేరుగాంచిన శ్రీ సమ్మక్కసారలమ్మ మహా జాతర సందర్భంగా జంపన్నవాగు పరిసరాల్లో చేపట్టిన అభివృద్ధి పనులపై తీవ్ర ఆరోపణలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రతి జాతర సమయంలో కోట్ల రూపాయల విలువైన టెండర్ పనులు ఒకే కాంట్రాక్టర్‌కు కట్టబెట్టడంపై స్థానికులు, భక్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.జాతర పేరుతో ప్రతి సారి భారీ మొత్తంలో ప్రభుత్వ నిధులు ఖర్చు చేస్తున్నట్లు చూపిస్తుండగా, వాస్తవానికి పాత సామగ్రినే మళ్లీ వినియోగిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకసారి కొనుగోలు చేసిన పరికరాలను జాతర ముగిసిన అనంతరం భద్రపరిచి, తదుపరి జాతరలో వాటినే ఉపయోగిస్తున్నప్పటికీ, అంచనా వ్యయాలు మాత్రం కోట్లలో పెరుగుతుండటంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పాత సామగ్రికి రంగులు వేసి కొత్త పనులుగా బిల్లులు సమర్పిస్తూ ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇతర కాంట్రాక్టర్లకు అవకాశం ఇవ్వకుండా ఒకే వ్యక్తికి వరుసగా పనులు అప్పగించడం వెనుక అధికారులతో కుమ్మక్కు ఉందన్న విమర్శలు కూడా వెల్లువెత్తుతున్నాయి. **విరాళ మోటార్ల వినియోగంపైనా ప్రశ్నలు** గత జాతర సందర్భంగా సిఆర్ఐ మోటార్స్ సంస్థ భక్తుల సౌకర్యార్థం జంపన్నవాగు వినియోగానికి మోటార్లను విరాళంగా అందజేసిన విషయం తెలిసిందే. అయితే ఆ మోటార్లు ప్రభుత్వాధీనంలో ఉండాల్సి ఉండగా, అవి కాంట్రాక్టర్ వద్దే ఉండి మళ్లీ కాంట్రాక్ట్ పనుల్లో ఉపయోగిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. విరాళంగా వచ్చిన సామగ్రిని కాంట్రాక్టర్ స్వంత ఆస్తిలా వినియోగించుకోవడం ఏమిటని భక్తులు ప్రశ్నిస్తున్నారు.ప్రతి జాతరలో కొద్ది రోజుల పనికే కోట్ల రూపాయల బిల్లులు ఎలా చెల్లిస్తున్నారన్న దానిపై స్పష్టత ఇవ్వాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మహా జాతర ముగిసిన అనంతరం కాంట్రాక్టర్ ఏర్పాటు చేసిన పరికరాలు తొలగించారా? ఖర్చులు పారదర్శకంగా ఉన్నాయా? అన్న అంశాలపై సమగ్ర విచారణ జరపాలని కోరుతున్నారు.జాతర పవిత్రతకు భంగం కలిగించే ఇలాంటి వ్యవహారాలను వెంటనే అరికట్టి, అవకతవకలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు, స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## రెండవ రోజు కుంకుమార్చనలో 108 మంది దంపతులు హాజరు



**అన్నమయ్య జిల్లా: పుంగనూరు ఫిబ్రవరి 5 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** పుంగనూరు నియోజకవర్గం చౌడేపల్లి మండలం దిగుపల్లి గ్రామంలో వెలసి ఉండు శక్తి క్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో జరుగుతున్న లక్ష కుంకుమార్చన లో భాగంగా గురువారం రెండవ రోజున 108 మంది దంపతులు హాజరైనట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఉదయాన్నే అమ్మవారి ఆలయంలో విషెస్ అభిషేకము అలంకరణ నిర్వహించారు. ప్రత్యేకించి లక్ష కుంకుమార్చన జరుగు స్థలంలో వేద పండితుల ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. లక్ష కుంకుమార్చనకు హాజరైన దంపతులకు ఈవో ఉప కమిషనర్ ఏకాంబరం అమ్మవారి పవిత్ర తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు ఆలయ అధికార అర్చక సిబ్బంది పాల్గొన్నారు.

## మరణించిన కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ జెడ్పిటిసి



**చిట్యాల జనవరి 5 (పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండలంలోని ఇటీవల మరణించిన కుటుంబాలను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపిన చిట్యాల మాజీ జడ్పీటీసీ గొర్రె సాగర్ యాదవ్. అందుగుతండ గ్రామానికి చెందిన కీ.శే భనోత్ మంగ్తె నాయక్ (గుండు) అందుగుతండ కి.శే కటకం లలిత కీ.శే గుటూరుపల్లి నిమ్మగడ్డ కార్తీక్ వారివెంట BRS పార్టీ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్ట సురేష్ బాబు, సీనియర్ నాయకులు కూర మహిపాల్ రెడ్డి, దీ=హ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు దాసరి తిరుపతి అప్ప రావు, గ్రామ వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్య మోహన్ నాయక్, పిల్లల సదయ్య, భూక్య సమ్మయ్య, లౌద్య రాకేష్ నాయక్, సురేందర్, శిలావత్, రాజు, పింకు, పాల్గొన్నారు.

## మేడారం జాతర గ్యాంగ్ రేప్ ఆరోపణలపై స్పష్టత

- ప్రాథమిక విచారణలో ఘటన జరగలేదని తేల్చిన జాతీయ మహిళా కమిషన్ బృందం



**ములుగు జిల్లా,ఫిబ్రవరి 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ములుగు జిల్లా మేడారం జాతరలో మైనర్ బాలికపై గ్యాంగ్ రేప్ జరిగిందన్న ఆరోపణలపై జాతీయ మహిళా కమిషన్ స్పందించింది. ఈ మేరకు ఏర్పాటు చేసిన ప్రత్యేక ఎంక్వయిరీ కమిటీ ప్రాథమికంగా జాతరలో ఎలాంటి గ్యాంగ్ రేప్ ఘటన జరగలేదని నిర్ధారించినట్లు వెల్లడించింది.మహిళా కమిషన్ సభ్యురాలు డెలినా, కంచన్ కట్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటైన విచారణ కమిటీ మధ్యాహ్నం ములుగు జిల్లాకు చేరుకుంది. అనంతరం ములుగు కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ దివాకరతో పాటు ఎస్పీ రామ్ నాథ్ కేకన్తో కమిటీ సభ్యులు భేటీ అయ్యారు.అధికారులతో సమావేశం అనంతరం, మేడారం జాతర పరిసరాల్లో గ్యాంగ్ రేప్ జరిగినట్లు ప్రచారం జరుగుతున్న ప్రాంతాన్ని కమిటీ పరిశీలించింది. అక్కడి పరిస్థితులు, లభ్యమైన వివరాలను ఆధారంగా తీసుకుని ప్రాథమికంగా అలాంటి ఘటన చోటుచేసుకోలేదని విచారణ బృందం స్పష్టం చేసింది.పోలీసుల నుంచి లిఖితపూర్వక నివేదిక అందిన అనంతరం, పూర్తి వివరాలతో కూడిన తుది నివేదికను జాతీయ మహిళా కమిషన్‌కు సమర్పించనున్నట్లు ఎంక్వయిరీ కమిటీ తెలిపింది.

# రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల కోసం 48 నిరాహార దీక్ష చేస్తా...

**- రిటైర్డ్ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలి..**

**- బిజెపి పార్లమెంటు కన్వీనర్, 50వ డివిజన్ బిజెపి అభ్యర్థి బోయిన్పల్లి ప్రవీణ్ కుమార్**





**కరీంనగర్,ఫిబ్రవరి05(పీసీడబ్ల్యూ న్యూస్):** ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేకపోతే కరీంనగర్లోని 48 గంటల నిరాహార దీక్ష చేపడతానని బిజెపి పార్లమెంట్ కన్వీనర్, 50వ డివిజన్ బిజెపి అభ్యర్థి బోయిన్పల్లి ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు. గురువారం రోజున 50 డివిజన్లో బోయినపల్లి ప్రవీణ్ కుమార్ విస్తృత ప్రచారం నిర్వహించి, స్థానిక రిటైర్డ్ ఉద్యోగులను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రధానంగా పెన్షన్ బెనిఫిట్స్, గ్రాట్యూటీ, జిపిఎఫ్, టీఎస్ జి ఎల్ ఐ, కమ్యూటేషన్, సరెండర్ లీవులు సకాలంలో అందక రిటైర్డ్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల పెళ్లిళ్లు, ఇల్ల నిర్మాణం, వైద్య అవసరాల కోసం దాచుకున్న డబ్బులు రాక , ఈఎంఐలు కట్టలేక మానసిక శోభకు గురవుతున్నారని తెలిపారు. ముఖ్యంగా వృద్ధాప్యంలో వైద్య ఖర్చులకు డబ్బులు లేకపోవడం, రాష్ట్ర ప్రభుత్వ హెల్త్ కార్డు అమల్లో ఇబ్బందులతో రిటైర్డ్ ఉద్యోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. కొత్త పెన్షన్ విధానం, పాత పెన్షన్ రాకపోవడం తో రిటైర్డ్ ఉద్యోగుల పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. ఉద్యోగులకు అందాల్సిన ఆర్థిక ప్రయోజనాల విషయంలో దాటవేతధోరణినీ అవలంబిస్తూ, మాయమాటలతో ప్రభుత్వ ఉద్యోగులను తీవ్రంగా మోసం చేస్తుందని ఆయన మండి పడ్డారు. ఇక నిరుద్యోగుల సమస్యలపట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ 6గ్యారెంటీల్లో నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి రూ. 3016 ఇస్తామని తీవ్రంగా మోసం చేసిందన్నారు. రెండేళ్ల కాలమైనా ఏ ఒక్క నిరుద్యోగిని ఆదుకున్న పాపాన కాంగ్రెస్ పోలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రిటైర్డ్ ఉద్యోగుల, నిరుద్యోగుల, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేకపోతే బిజెపిపార్టీ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపడతానని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.

## ఏజెన్సీలో రద్దు చేసిన కల్లు గీత సొసైటీలను తక్షణమే పునరుద్ధరణ చేయండి



**ములుగు జిల్లా, ఫిబ్రవరి05(పీసీడబ్ల్యూ న్యూస్):**గోవిందరావుపేట మండలంలోని తాటి వనంలో తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం గోవిందరావుపేట అధ్యక్షులు రుద్రబోయిన మల్లేష్ గౌడ్ కార్యదర్శి వచ్చావాయి సారయ్య గౌడ్ మండలకేంద్రం లోని తాటి వనం లో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించిన కల్లు గీత కార్మికులు గోవిందరావుపేట కల్లు గీత కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ఈరోజు నూతన సంవత్సర క్యాలెండర్ను ఆవిష్కరించడం జరిగింది సంఘం మండల అధ్యక్షులు రుద్రబోయిన మల్లేష్ గౌడ్ కార్యదర్శి వత్సవాయి సారయ్య గౌడ్ లు మాట్లాడుతూ రద్దు చేసిన గీత సొసైటీలను తక్షణమే పునరుద్ధరణ చేసి కల్లుగీత కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని అన్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ప్రభుత్వంలో ఏజెన్సీ సొసైటీలపై అసెంబ్లీలో మాట్లాడటం జరిగిందని ఇప్పుడు అధికారం లోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయిన కూడా ఏజెన్సీలో కలుగీత సొసైటీల గీత కార్మికుల సమస్యల మీద స్పందించకపోవడం చాలా బాధాకరమని అన్నారు ఎటువంటి సంక్షేమ పథకాలు అందక కాల్లు గీత కార్మికులు చాలా ఇబ్బందులు గురవుతున్నారు అన్నారు ఇప్పటికైనా ముఖ్యమంత్రి స్పందించి రద్దు చేసిన సొసైటీలపై చర్చించి సొసైటీల ను పునరుద్ధరణ చేసి కల్లు గీత కార్మికులను ఆదుకోవాలని వారు అన్నారు సంఘం సీనియర్ నాయకులు కాసాగాని బిక్షం గౌడ్ సొసైటీ అధ్యక్షులు కాసగాని స్వామి గౌడ్ కొండవీరేశం గౌడ్ మరికంటి సారి బాబుగౌడ్ ఉప్పలయ్య గౌడ్ బోలాగని చెంద్రయ్య గౌడ్ దుంపిల్లా గూడెం ఉపసర్పంచ్ బండి రాజశేఖర్ గౌడ్ తో పాటు 15 మంది గీత కార్మికులు పాల్గొన్నారు

## పెన్షనర్ల బకాయిలు ఒకేసారి విడుదల చేయాలి

- ఆర్థిక ఇబ్బందులతో 35 మంది చనిపోవడం బాధాకరం
- వైద్య చికిత్సకు డబ్బులు లేక, పిల్లల పెళ్లిళ్లు చేయలేక మానసికంగా కుంగిపోతున్నారు
- పి.ఆర్.పి.ఏ జిల్లా కన్వీనర్ యలమద్ది వెంకటేశ్వర్లు



**ఖమ్మం ప్రతినిధి, ఫిబ్రవరి 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులుగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన పెన్షనర్ల బకాయిలను ఒకేసారి చెల్లించి ఆ కుటుంబాలను ఆదుకోవాలని ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ (పిఆర్పీఎ) ఖమ్మం జిల్లా కన్వీనర్ యలమద్ది వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. పిఆర్టియు భవన్లో గురువారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వైవి మాట్లాడుతూ... గ్రాట్యువిటీ, కమిటేషన్, జిపిఎఫ్, జిఐఎస్ బకాయిలను ఏడాదిన్నర కాలం పాటు చెల్లించకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులతో సుమారు 35 మందికి పైగా చనిపోవడం చాలా బాధాకరమని పేర్కొన్నారు. తీవ్ర అనారోగ్యానికి పాలైన వారు వైద్య చికిత్సకు డబ్బులు లేక, పిల్లలకు పెళ్లిళ్లు చేయలేక, పెన్షనర్లు మానసికంగా తీవ్రంగా కుంగిపోతున్నారని వారు పేర్కొన్నారు. పిఆర్సి ఊసే లేదని, ఆరోగ్య కార్డుల జారీ ఎండమావిగా మారిందని వారు పేర్కొన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్లు బకాయిలు చెల్లించి వారు పడుతున్న మానసిక వేదన నుంచి బయటపడేలా రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం రోటరీ నగర్, బ్యాంక్ కాలనీ లో నివాసం ఉంటున్న పెన్షనర్ల ఇంటింటికీ వెళ్లి పి.ఆర్.పి.ఏ సభ్యత్వాలను అందజేశారు.పిఆర్టియు జిల్లా మాజీ అధ్యక్షులు చలపతిరావు, కొత్త శ్రీనివాసరావు, ఎం.దామోదర్ రెడ్డి, హమీద్, ఎం. సీతారామయ్య, మల్లవరపు కాంతారావు, దండా గురవయ్య, వి.జగన్ మోహన్ రావు, కొత్తపల్లి గురుప్రసాద్, వెల్లంకి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 22 లోపు ఫౌండేషన్ కోర్సు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు సమర్పించాలి...

- షెడ్యూల్ కులాల అధ్యయన కేంద్రం ఖమ్మం జిల్లా సంచాలకులు వెంకటేశ్వర్లు

**ఖమ్మం, ప్రతినిధి ఫిబ్రవరి 5 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఖమ్మం ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో రెసిడెన్షియల్ పద్ధతిలో 5 నెలల పాటు ఉచిత శిక్షణ అందించే ఫౌండేషనల్ కోర్సు ప్రవేశ పరీక్షకు ఆసక్తి గల అభ్యర్థులు ఫిబ్రవరి 22 లోపు దరఖాస్తు చేసుకోవాలని షెడ్యూల్ కులాల అధ్యయన కేంద్రం ఖమ్మం జిల్లా సంచాలకులు ఎస్. వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఖమ్మం స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్స్, రైల్వే రిక్రూట్మెంట్ బోర్డ్, స్టాఫ్ సెలక్షన్ కమిటీ, బ్యాంకింగ్ మొదలైన వివిధ పోటీ పరీక్షలకు సంబంధించి భోజన, వసతితో కూడిన 5 నెలల బేసిక్ ఫౌండేషన్ కోర్సును అర్హులైన 100 మంది నిరుద్యోగ అభ్యర్థులకు ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు.ఎస్సీలకు 75 శాతం, ఎస్టీలకు 10 శాతం, బీసీలకు, మైనారిటీ లకు కలిపి 15 శాతం, ఓవరాల్ మహిళలకు 33.3 శాతం, దివ్యాంగులకు ఐదు శాతం చొప్పున రిజర్వేషన్ పాటించడం జరుగుతుందని, అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం 3 లక్షల లోపు ఉండాలని, అభ్యర్థులు డిగ్రీ ఉత్తీర్ణత సాధించి ఉండాలని అన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు స్టడీ సర్కిల్ ప్రవేశ పరీక్షకు http://tsstudy-circle.co.in వెబ్ సైట్ లో ఫిబ్రవరి 22 లోపు దరఖాస్తులు సమర్పించాలని, ఇతర వివరాలకు 9866726277, 7981988667 నెంబర్ నందు సంప్రదించాలని షెడ్యూల్ కులాల అధ్యయన కేంద్రం ఖమ్మం జిల్లా సంచాలకులు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## నాలుగు కొత్త కార్మిక కోడ్‌లు అమలు: ప్రాంతీయ పీఎఫ్ కమీషనర్ శ్రీనివాస్

**ఖమ్మం, ప్రతినిధి ఫిబ్రవరి 05 (పిసిడబ్ల్యూ న్యూస్):** 2025 నవంబర్ 21 నుంచి నాలుగు కొత్త కార్మిక కోడ్ లు అమలు లోకి వచ్చాయని ప్రాంతీయ పీఎఫ్ కమీషనర్ వై.డి. శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.భారత ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను ఏకీకృతం చేసి, నాలుగు సమగ్ర కార్మిక కోడ్ లను అమలులోకి తీసుకువచ్చిందని అన్నారు. వేతనాల కోడ్ 2019, పారిశ్రామిక సంబంధాల కోడ్ 2020, సామాజిక భద్రత కోడ్ 2020, వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని ప్రదేశ పరిస్థితుల కోడ్ 2020 లను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని అన్నారు.కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త లేబర్ కోడ్స్ ప్రకారం ఈపిఎఫ్ వేతనాల నిర్వచనం ఏకరీతిగా అమలులోకి వచ్చిందని అన్నారు. వేతనాలు అంటే బేసిక్ పే, డియర్నెస్ అలవెన్స్ (ణూ), రిటైనింగ్ అలవెన్స్ కలిపి తీసుకోవాలనీ, హౌస్ రెంట్ అలవెన్స్ (ఎ=ూ), బోనస్, ఓవరైమ్ అలవెన్స్, కన్వేయెన్స్ అలవెన్స్, కమీషన్, ఇతర సౌకర్యాల విలువలను వేతనాల నుండి మినహాయించాలని తెలిపారు. అయితే ఈ మినహాయింపులు మొత్తం వేతనంలో 50 శాతం కంటే ఎక్కువైతే, అదనపు భాగాన్ని తిరిగి వేతనాల నిర్వచనంలో కలపాలని అన్నారు.నూతన విధానాల వల్ల ఈపిఎఫ్ కాంట్రిబ్యూషన్ బేస్ పెరుగుతుందని, ఉద్యోగుల కు పిఎఫ్ డిడక్షన్ ఎక్కువైనా, రిటైర్మెంట్ సేవింగ్స్ పెరుగుతాయని , యజమానులకు కాంప్లయెన్స్ స్పష్టత వస్తుందని, వేతనాలను కృత్రిమంగా తగ్గించడం కష్టమవుతుందని, ఈ మార్పులు ఉద్యోగుల భవిష్యత్ భద్రతను బలోపేతం చేస్తాయని అన్నారు.ఈ కార్మిక కోడ్ లు ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషిస్తాయని, కార్మికుల సంక్షేమం, వ్యాపార సౌలభ్యం మధ్య సమతుల్యతను కాపాడుతూ దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడతాయని, ఈ కోడ్ ల క్రింద లభించే ప్రయోజనాలను వినియోగించుకోవాలని యజమానులకు, ఉద్యోగులకు వై.డి. శ్రీనివాస్ ఆ ప్రకటనలో సూచించారు.

## మున్సిపల్ ఎన్నికలపై అవగాహన సదస్సు విజయవంతం..




**కరీంనగర్ టౌన్ ఫిబ్రవరి 05(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 2026 మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమం పట్టణంలోని రెవెన్యూ సభా మందిరంలో ఘనంగా జరిగింది.ఈ సదస్సుకు ఎన్నికల అధికారులు, పోలీసు శాఖ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రాముఖ్యత, స్వేచ్ఛాయుతంగా ఓటు వేయడం, ఎన్నికల నియమావళి పాటించాల్సిన అవసరంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా, నిష్పక్షపాతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలు పాటించాలని, సహకారం అందించాలని ప్రజలను కోరారు.ఈ సమావేశంలో పెద్ద సంఖ్యలో స్థానికులు, యువత, నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సదస్సు ద్వారా ప్రజల్లో ఎన్నికలపై అవగాహన మరింత పెరిగిందని నిర్వాహకులు తెలిపారు.

# బీజేపీకి గెలిపించిన వెంటనే రూ.500 కోట్లు తెస్తా: మా చొరవతోనే పంచాయతీలకు రూ.250 కోట్లు విడుదలైనయ్...

- రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో మున్సిపాలిటీలకు ఇచ్చింది గాడిద గుడ్డే.
- కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని మున్సిపాలిటీలకు వరదలా నిధులు తీసుకొస్తా.
- హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీలకు కేంద్రం పెద్ద ఎత్తున నిధులిచ్చింది.
- మున్సిపల్ పీఠం అప్పగించిన వెంటనే హుజూరాబాద్ లో స్టేడియం నిర్మించే బాధ్యత నాది.
- సీఎస్సార్, ఎంపీ లాడ్స్ నిధులతో సౌకర్యాలు కల్పిస్తా.
- మినీ ట్యాంక్ పనులు పూర్తి చేయిస్తా.
- హుజూరాబాద్ రూపురేఖలు మారుస్తా.
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు.
- హుజూరాబాద్ బీజేపీ అభ్యర్థులతో ప్రతిజ్ఞ చేయించిన కేంద్ర మంత్రి...





**హుజురాబాద్,ఫిబ్రవరి05(పీసీడబ్ల్యూ న్యూస్):** మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే రాష్ట్రానికి రూ.500 కోట్ల నిధులు తీసుకొస్తానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలైనందున కేంద్రం తాజాగా రూ.259 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, తాను చొరవ తీసుకోవడంవల్లే నిధులు విడుదలయ్యాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో మున్సిపాలిటీలకు గాడిద గుడ్డు మాత్రమే ఇచ్చిందని ఎద్దేవా చేశారు. తమకు మోసపు మాటలు చెప్పడం చేతకాదని, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మాదిరిగా దొంగ హామీలు ఇవ్వలేమని చెప్పారు. మాట ఇచ్చామంటే తప్పకుండా నెరవేర్చి తీరుతామని అన్నారు. హుజూరాబాద్ మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని బీజేపీకి అప్పగిస్తే ఢిల్లీకి పోయి పెద్ద ఎత్తున నిధులు తీసుకొచ్చి హుజూరాబాద్ పట్టణం రూపురేఖలు మారుస్తానని హామీ ఇచ్చారు. హుజూరాబాద్ లో మినీ స్టేడియం నిర్మాణం కోసం కేంద్రం నుండి నిధులు తీసుకొచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగడుగునా ఆటంకాలు కల్పించడంవల్ల ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు. ఎన్నికలైన వెంటనే స్టేడియం నిర్మాణం పనులు మొదలుపెట్టేలా చర్యలు తీసుకుంటానని, ఎవరు అడ్డు వస్తారో చూస్తానని అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈరోజు హుజూరాబాద్ పట్టణంలో నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, ఎన్నికల ఇంఛార్జ్ ఎర్రం మహేశ్ సహా స్థానిక నేతలంతా సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ చేసిన ప్రసంగంలోని ముఖ్యాంశాలు..హుజూరాబాద్ పట్టణానికి పెద్ద ఎత్తున నిధులు తీసుకొచ్చిన. కేంద్ర ప్రభుత్వం హుజూరాబాద్ అభివృద్ధి కోసం ఎన్ని నిధులిచ్చిందో, ఏయే అభివృద్ధి పనులు జరిగాయో పూర్తి వివరాలతో సహా బుక్ లెట్ ప్రింట్ చేయించిన. వాటిని ఇంటింటికీ పంపుతున్నా. 14, 15వ ఆర్థిక సంఘం ద్వారా 19 కోట్ల 57 లక్షలు స్వచ్ఛ భారత్ ద్వారా 1 కోటి 10 లక్షలు అమ్రుత్ 16 కోట్ల 25 లక్షలు స్వనిధి ద్వారా 4వేల 377 మందికి 7 కోట్ల 63 లక్షలు పట్టణ మౌలిక సదుపాయాల(యూఐడీఎఫ్) ద్వారా 36 కోట్లు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఇచ్చింది. వీధి దీపాల మొదలు, రోడ్లు, డ్రైనేజీ, స్మశాన వాటిక నిర్మాణం దాకా అన్నీ కేంద్ర నిధులే. ఇవిగాక సీఎస్సార్, ఎంపీ లాడ్స్ నిధులతో కోట్ల రూపాయలు తీసుకొచ్చి హుజూరాబాద్ లో ఆసుపత్రికి మెడికల్ ఎక్విప్ మెంట్స్ ఇచ్చిన. వాటిని మెయింటెనెన్స్ చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికే ఉంది. కానీ అక్కడ డాక్టర్లు, సిబ్బంది ఆశించిన స్థాయిలో లేరు. అట్లాగే కమ్యూనిటీ హాల్స్ నిర్మించిన. బోర్లు వేయించిన. ప్రభుత్వ స్కూళ్లలో టెన్త్ చదివే విద్యార్థులందరికీ ఉచితంగా సైకిళ్లు ఇచ్చిన. టెన్త్ పరీక్ష ఫీజు నా జీతం నుండే చెల్లించిన. బీజేపీకి మున్సిపల్ చైర్మన్ పీఠం అప్పగించిన వెంటనే హుజూరాబాద్ పట్టణంలో అర్థాంతరంగా నిలిచిన మినీ ట్యాంక్ బండ్ పనుల పూర్తి చేయిస్తా. పట్టణంలోని నిరుపేదలకు ఇళ్ల మంజు చేయిస్తా. బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పంపిణికి తక్షణ చర్యలు చేపడతాం. పట్టణంలో అవసరమైన చోట మురుగు కాలువలు, సీసీ రోడ్లు, విద్యుత్ దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. హుజూరాబాద్ సుందర పట్టణాలుగా తీర్చి దిద్దేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటా. హుజూరాబాద్‌లో కూడా మినీ స్టేడియం ఏర్పాటుకు కేంద్ర మంత్రిగా ప్రత్యేక చొరవ తీసుకొని నిధుల మంజూరికి కృషి చేస్తా. హుజూరాబాద్ నియోజకవర్గానికే పెద్దదిక్కుగా ఉన్న 100 పడకల ప్రభుత్వ దావఖానాలో కార్పోరేట్ స్థాయి వైద్య సేవలు అందేలా ప్రత్యేక చొరవ తీసుకుంటాం. మాకు మోసాలు చేయడం రాదు. దొంగ హామీలివ్వడం చేతకాదు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మోసపు మాటలు నమ్మి మీరు మోసపోయారు. అందుకే మహిళలకు రూ.2500లు, తులం బంగారం, స్కూటీ, అవ్వాతాతలకు రూ.4 వేలు, నిరుద్యోగ భ్రుతి ఇయ్యలే. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో మున్సిపాలిటీలకు ఏమిచ్చారు? గాడిద గుడ్డు తప్ప. అందుకే మంచి పాలన కోసం ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇవ్వండి ..మీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటా.

## లేఔట్ అనుమతుల జారీలో నిబంధనలే ప్రాతిపదిక : జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**అప్రోచ్ రోడ్డు లేకుండా లేఔట్‌కు అనుమతి లేదు**

**వాటర్ బాడీస్ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో అనుమతులు కట్టుదిట్టంగా నిరాకరణ**



**ఖమ్మం, ప్రతినిధి ఫిబ్రవరి 05 (పిసిడబ్ల్యూ న్యూస్):** లేఔట్ అనుమతుల మంజూరులో ప్రభుత్వ నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఒక్క అనుమతీ ఇవ్వకూడదని స్పష్టం చేశారు. కలెక్టరేట్ ప్రజ్ఞా సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి లేఔట్ కమిటీ సమావేశంలో మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. పెండింగ్‌లో ఉన్న లేఔట్ దరఖాస్తులపై రెవెన్యూ, ఇరిగేషన్, ఇతర లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సమగ్రంగా చర్చించి కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కమిటీ 12 డ్రాఫ్ట్ లేఔట్‌లు, 4 ఫైనల్ లేఔట్‌లను పరిశీలించిందన్నారు. లేఔట్‌కు తప్పనిసరిగా 18 మీటర్ల అప్రోచ్ రోడ్డు ఉండాలని, రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూమి లేఔట్‌లో స్పష్టంగా కేటాయింపులు జరగాలని సూచించారు. లేఔట్ ప్రాంతాలు నీటి వనరులు, నీటి ప్రవాహాలకు నిర్దేశించిన దూరంలోనే ఉండాలని, గతంలో అక్కడ ఏవైనా చెరువులు, కాలువలు, నీటి వనరులు ఉన్నాయా అనే అంశాన్ని ఆధునిక సాంకేతికతతో క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. ఏడి సర్వే & ల్యాండ్ రికార్డ్స్, మండల సర్వేయర్, ఆర్డీఓలు సంయుక్తంగా చుట్టుపక్కల సర్వే నంబర్లను పరిశీలించి స్పష్టమైన నివేదిక సమర్పించాలని తెలిపారు. లేఔట్ అనుమతి ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, మంజూరు చేసిన అనుమతుల నిబంధనలు అభివృద్ధి దశలో పాటిస్తున్నారా లేదా అనే అంశంపై పర్యవేక్షణ తప్పనిసరి అన్నారు. ఈ సమావేశంలో ఎస్‌డీసీ ఎం. రాజేశ్వరి, ఆర్ అండ్ బీ ఎస్‌ఈ యాకోబు, పీఆర్ ఎస్‌ఈ వెంకట్ రెడ్డి, ఎన్పీడీసీఎల్ ఎస్‌ఈ శ్రీనివాసాచారి, జిల్లా టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారి, సర్వే & ల్యాండ్ రికార్డ్స్ ఏడి రాజేందర్, ఏదులాపురం టౌన్ ప్లానింగ్ అధికారి, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస రెడ్డి, డీఈ కే. రాజేష్, తహసీల్దార్లు రాంప్రసాద్, సైదులు, శ్వేత, అరుణ తదితర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నిబంధనలు ఉల్లంఘించిన వ్యక్తిపై కేసు నమోదు

- రమణయ్యపై కేసు నమోదు
- మద్యం సీజ్ చేసిన పోలీసులు



**కల్లూరు, ఫిబ్రవరి 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఎన్నికల నియమ నిబంధనలను ఉల్లంఘించి మద్యము అమ్మకాలు నిర్వహిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై డి హరిత తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో నమ్మదగిన సమాచారం మేరకు కల్లూరు టౌన్ లోని బావర్చి రెస్టారెంట్లో ఎలక్షన్ నియమా లకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న గోసు రమణయ్య విక్రయిస్తున్నట్లు సమాచారం తెలియడంతో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. కల్లూరు మండలం చంద్రుపట్ల గ్రామంనికి వ్యక్తిపై పోలీసు వారు కేసు నమోదు చేసి 16,550 రూపాయల మద్యాన్ని సీజ్ చేశారని తెలిపారు.

ఎవరైనా ఎన్నికల నియమ నిబంధనలను ఉల్లంఘించి చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలుకు పాల్పడినట్లయితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని పడతాయని హెచ్చరించారు. ఈ దాడి లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజల అవసరాలకు అనుగుణంగా వసతులు మెరుగుపరచాలి

**రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి**

**ఫిబ్రవరి నెలాఖరుకు సీవరేజ్, టాయిలెట్స్ నిర్మాణ పనులు పూర్తి చేయాలి**

**ఔట్ పేషెంట్ సేవలు మెరుగ్గా అందించేందుకు ముగ్గురు డేటా ఎంట్రీ ఆపరేటర్ల నియామకం**

**7 రోజుల వ్యవధిలో లిఫ్ట్ మరమ్మత్తు పూర్తి చేయాలి**

**మార్చి 15 నాటికి ఎస్.టి.పి. నిర్మాణం పూర్తి**

**ఎఫ్.ఆర్.ఎస్. విధానంలో ఆసుపత్రి సిబ్బంది హాజరు**

**ఖమ్మం జనరల్ ఆసుపత్రి పని తీరు, పెండింగ్ పనులపై వివిధ విభాగాల వైద్యులు, అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



**ఖమ్మం, ప్రతినిధి ఫిబ్రవరి 05 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఖమ్మం జనరల్ ఆసుపత్రి ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలందిస్తూ, ఆసుపత్రిలో ప్రజల అవసరాలకు అనుగుణంగా వసతులు మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ లోని ప్రజ్ఞ మీటింగ్ హాల్ లో గురువారం ఖమ్మం జనరల్ ఆసుపత్రి పని తీరు, ఆసుపత్రిలో ఉన్న పెండింగ్ అభివృద్ధి పనులపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి ఆసుపత్రి వైద్య అధికారులు, మున్సిపల్, మిషన్ భగీరథ, సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా ఖమ్మం ఆసుపత్రిలో వసతులు మెరుగుపరచాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణ సిబ్బంది, వైద్యులు అందుబాటులో ఉండటం లేదని, ఫిర్యాదులు వస్తున్నాయని, ఈ పద్దతిలో వెంటనే మార్పు రావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రెండు వారాలకు ఒకసారి ఆసుపత్రి పని తీరుపై ఖమ్మం మున్సిపల్ కమీషనర్ రివ్యూ నిర్వహించాలని అన్నారు. ఆసుపత్రిలోని 10 స్పెషల్ రూమ్ మరమ్మత్తు పనులు మునిసిపల్ కార్పోరేషన్ ద్వారా చేపట్టి 15 రోజులలో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఎమర్జెన్సీ సమయంలో వినియోగించేందుకు జిజిహెచ్ వద్ద 5 లక్షల రూపాయలు నిరంతరం అందుబాటులో పెడతామని, ఏ విభాగంలో నైనా వైద్య పరికరాలు, యంత్రాలు అవసరం ఉంటే, వెంటనే కొనుగోలు చేయాలని, ఆసుపత్రిలో కోటి 65 లక్షలతో చేపట్టిన టాయిలెట్స్ లను రాబోయే నెల రోజుల వ్యవధిలో 100 శాతం పూర్తి చేసి, టాయిలెట్స్ నిర్మాణంతో పాటు వాటి నిర్వహణకు కూడా చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రిలో ఆర్.ఎం.ఓ. లను నియమించి పాలన వ్యవహారాలు వారికి అప్పగించాలని కలెక్టర్ సూచించారు. ఎం.సి.హెచ్. లోని సీవర్ లైన్స్, టాయిలెట్స్ పనులు ఫిబ్రవరి నెలాఖరు వరకు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రి ముందు ఉన్న ఖాళీ స్థలంలో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని కలెక్టర్ తెలిపారు. ఓపి రిజిస్ట్రేషన్ కోసం ప్రత్యేక బ్లాక్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఓపి కోసం 3 డేటా ఎంట్రీ ఆపరేటర్ లను తాత్కాలిక ప్రాతిపదికన నియమించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రిలో లిఫ్ట్ మరమ్మత్తు పనులు పూర్తి కాకపోవడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేసి, 7 రోజుల్లో లిఫ్ట్ పని చేయాలన్నారు. ఆసుపత్రి అవసరాల కోసం ప్రస్తుత వాటర్ సంప్ సరిపోవడం లేదని, మరో 200 కేఎల్ సామర్థ్యంతో కూడిన సంప్ నిర్మించాలని అన్నారు. వర్షా కాలం ముందే ఆసుపత్రి భవనం నుండి ఎక్కడా వాటర్ లీకేజి కాకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. ఎస్.టీ.పి. పెండింగ్ నిర్మాణ పనులను మరొక కాంట్రాక్టర్ తో చేపట్టి మార్చి 15 నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రిలో అవసరమైన ఫైర్ సేఫ్టీ పనులు, సిసి కెమెరాల ఏర్పాటు మార్చి 15 నాటికి ఏర్పాటు చేయాలని కలెక్టర్ మున్సిపల్ కమీషనర్ కు సూచించారు. ఆసుపత్రి వద్ద రోడ్డు పై స్పీడ్ బ్రేకర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, అవసరమైన భద్రత ఏర్పాట్లు ఉండాలన్నారు. ఆసుపత్రిలో అవసరమైన అంతర్గత రోడ్లు, ఫుట్ పాత్ తో సహా నిర్మాణ పనులు చేపట్టి నెలాఖరు వరకు పూర్తి చేయాలని అన్నారు. నెలకు 55 లక్షలు ఖర్చు చేస్తున్నప్పటికీ ఆసుపత్రిలో ఆశించిన స్థాయిలో పారిశుద్ధ్యం ఉండటం లేదని కలెక్టర్ అన్నారు. పారిశుద్ధ్య పని తీరు సరిగ్గా లేదంటూ సంబంధిత ఏజెన్సీలకు నోటీసు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పారిశుద్ధ్యం పని తీరు ఇంప్రూవ్ కాని పక్షంలో సదరు ఏజెన్సీ రద్దు చేయాలని డీఎంఈకు లేఖ రాయాలని అన్నారు. ఆసుపత్రిలో ఎఫ్.ఆర్.ఎస్. విధానంలో పారిశుద్ధ్య సిబ్బంది హాజరు నమోదయ్యేలా వ్యవస్థ ఏర్పాటు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎఫ్.ఆర్.ఎస్. హాజరు రిపోర్ట్ ఆధారంగా పారిశుద్ధ్య సిబ్బందికి సంబంధించి జీతాలు చెల్లింపు చేయాలని అన్నారు. బయో మెడికల్ వేస్ట్ డిస్పోజల్ కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఫిబ్రవరి 11 నాటికి బయో మెడికల్ ఇంజనీర్ తాత్కాలికంగా నియామకం చేపట్టాలని, ఆసుపత్రి కోసం అవసరమైన సామాగ్రి కొనుగోలుకు అందించిన ప్రతిపాదనలు ఫాలో అప్ చేస్తూ త్వరగా ఆసుపత్రికి చేరేలా చూడాలని, టిఫ్ఫా స్కానింగ్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గత 3 నెలలుగా జనరల్ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య తగ్గుతుందని అన్నారు. అత్యంత క్లిష్టమైన హై రిస్క్ కేసులను గాంధీ ఆసుపత్రికి రిఫర్ చేసిన తర్వాత ఆ కేసులను ఫాలో అప్ చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. నరేందర్, వైద్య శాఖ ఇఇ ఉమామహేశ్వర రావు, మునిసిపల్ సహాయ కమిషనర్ అనిల్ కుమార్, వివిధ విభాగాల వైద్య అధికారులు, మిషన్ భగీరథ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## దాబా ప్రారంభించిన ఎమ్మెల్యే...



**తిమ్మాపూర్,ఫిబ్రవరి05(పీసీడబ్ల్యూ న్యూస్):** తిమ్మాపూర్ మండలం అలుగునూరు శివారు జాతీయ రహదారిలో నూతనంగా ఏర్పాటు చేసిన పబ్ జీ టేస్టీ దాబా – ఫ్యామిలీ రెస్టారెంట్ ను మానకొండూర్ ఎమ్మెల్యే,టీపీసీసీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి, అంకిత్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఎండీ డా.కవ్వంపల్లి అనురాధ, 8వ డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థి గోపు మల్లారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగోని లక్ష్మినారాయణ గౌడ్, తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, మాజీ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు కుంట రాజేందర్ రెడ్డి, మహాత్మానగర్ సర్పంచ్ పొన్నాల సంపత్, ఉప సర్పంచ్ కేతిరెడ్డి ఎల్లారెడ్డి, దాబా యజమానులు కనపర్తి వెంకటసాయి, అంతగిరి అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి పనులే గెలిపిస్తాయి





## గడపగడపకు ప్రచారం నీరాజనం పట్టిన ఓటర్లు

## 18వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి పెడకంటి కృష్ణయ్య

**కల్లూరు, ఫిబ్రవరి 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలన, చేసిన సంక్షేమ అభివృద్ధి పనులే మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తాయని 18 వ వార్డు బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి పెడకంటి రామకృష్ణ(కృష్ణయ్య )అన్నారు.గురువారం 18 వ వార్డు పరిధిలో శాంతినగర్లో ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు ప్రజలు నిరాజనం పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో ఈ నెల 11 న జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో సిపిఎం పార్టీ బలపరిచిన బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను 20 వార్డులో గెలిపించాలని అన్నారు. గత పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో కాలంలో మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు సారథ్యంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య నాయకత్వంలో కల్లూరు మున్సిపాలిటీ పరిధిలో జరిగిన అభివృద్ధి పనులు మా విజయానికి కారణం అవుతాయని అన్నారు. కోట్ల రూపాయల నిధులతో కల్లూరు మున్సిపాలిటీ అభివృద్ధి చేశారని అన్నారు. నూతనంగా నిర్మించిన ప్రభుత్వ హాస్పటల్ , మినీ స్టేడియం, నూతన బస్ స్టాండ్ ను చూస్తేనే బిఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి కనపడుతుందని అన్నారు. అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు అయినా కాంగ్రెస్ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి శూన్యం అని అన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ 18 వ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థిగా కారు గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. రానున్న కాలంలో మరింత అభివృద్ధి చేసి చూపిస్తామని తెలిపారు. శాంతినగర్ పరిధిలో డ్రైనేజీ సమస్యఉందని, డ్రైనేజీ నిర్మించి శాశ్వత పరిష్కారం చూపిస్తానని, అర్హులందరకు సంక్షేమ పథకాలు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి తన్నీరు కృష్ణార్జునరావు, బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కొరకొప్పు ప్రసాద్, బిఆర్ఎస్ నాయకులు మాజీ ఎంపీటీసీ ఖమ్మం పాటి పుల్లారావు, మాజీ వార్డ్ సభ్యులు కొత్తపల్లి వెంకటేశ్వర్లు, వెంగళ వెంకటేశ్వర్లు, రాచమళ్ళ నాగేశ్వరరావు, కాటేపల్లి రజనీకాంత్, కళ్యాణ్ కిషోర్ చారుగుండ్ల సందీప్,19వ వార్డ్ బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి ఖమ్మం పాటి స్వరూప రమేష్, నల్లగట్ల మారయ్య, కొత్తపల్లి ఏసులు పాల్గొన్నారు.

# వార్డు అభివృద్ధి కొరకే ఎన్నికల్లో పోటీ

## • 16వ వార్డు స్వతంత్ర అభ్యర్థి ఉబ్బన రాంబాబు





**కల్లూరు, ఫిబ్రవరి 5 (పిసిడబ్ల్యూ న్యూస్):** మున్సిపాలిటీ పరిధి 16వ వార్డు అభివృద్ధి కొరకే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నని ఎన్నికల్లో నాకు కేటాయించిన ఎయిర్ కండిషన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఉబ్బన రాంబాబు కోరారు. గురువారం 16వ వార్డులో ఇంటింటికి తిరుగుతూ ఓటర్లు కలుసుకొని ఓట్ల అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2003 నుండి కాంగ్రెస్ పార్టీలోనే ఉంటున్నారని, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ గెలుపు కోసం విశేషంగా కృషి చేశానని, అనివార్య కారణాలవల్ల టిక్కెట్ రాకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా 16వ వార్డులో బరిలో ఉన్నానని అన్నారు. 16వ వార్డు అభివృద్ధి కొరకే పోటీ చేస్తున్నానని వార్డు పరిధిలో డ్రైనేజీ సమస్య ఎక్కువగా ఉందని ఎన్నికల్లో నన్ను గెలిపిస్తే డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తానని అన్నారు. వార్డు లో మౌలిక వసతుల కల్పనలో ముందు ఉంటానని, స్థానిక ప్రైమరీ స్కూల్లో విద్యార్థులకు ప్రతి సంవత్సరం స్కూల్ బ్యాగులు, నోటుబుక్కులు పంపిణీ చేస్తానని మీ కుటుంబంలో ఒక సభ్యుడిగా ఉండి మీ సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేస్తానని ఈ సందర్భంగా అన్నారు. ఎన్నికల్లో నా కేటాయించిన గుర్తు ఎయిర్ కండిషన్. ఎయిర్ కండిషన్ గుర్తుపై మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని 16వ వార్డు వాటర్ దేవుళ్లను వేడుకున్నారు.

# కారు గుర్తుతోనే అభివృద్ధి





## ● గూడ సంజీవరెడ్డి గెలుపు నల్లేరు మీద నడకే ● పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి విస్తృత ప్రచారం

**ఖమ్మం ప్రతినిధి, ఫిబ్రవరి 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పోరాడి సాధించుకున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో కారు గుర్తుతోనే అభివృద్ధి జరుగుతుందని, ఖమ్మం జిల్లా, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న ఎన్నికల్లో సీపీఎం పార్టీ మద్దతుతో బిఆర్ఎస్ పార్టీ 22వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గూడ సంజీవరెడ్డి గెలుపు నల్లేరు మీద నడకే నని పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి గురువారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు పరిధిలో విస్తృత ప్రచారంలో ఓటర్లను ఉద్దేశించి మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ... బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి పనులు, ప్రజలకు అందిన సంక్షేమ పథకాలను వివరించారు. పేదల జీవితాల్లో మార్పు తీసుకొచ్చిన బిఆర్ఎస్ పాలనను గుర్తు చేస్తూ, మళ్లీ అదే అభివృద్ధి కొనసాగాలంటే బిఆర్ఎస్‌కు అవకాశం ఇవ్వాలని పిలుపునిచ్చారు.అదేవిధంగా, ఆరు గ్యారెంటీల అమలు పేరుతో ప్రజలను మాయ మాటలతో మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. మాట తప్పి మోసం చేసిన కాంగ్రెస్ పాలనను ప్రజలు గుర్తించాలని, మరోసారి మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రానున్న రోజుల్లో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే



'కారు' గుర్తుకే ఓటు వేసి గూడ సంజీవరెడ్డిని ఘన విజయం సాధింపజేయాలని ఆయన ఓటర్లను కోరారు. ఈ ప్రచారంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బాధితులకు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను అందజేసిన ఎస్సై శ్రావణ్ కుమార్



**చిట్యాల జనవరి 5 (పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండలంలో వివిధ గ్రామాల్లో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను రికవరీ చేసి, బాధితులకు తిరిగి చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఎస్సై శ్రావణ్ కుమార్ రికవరీ చేసిన నాలుగు మొబైల్ ఫోన్లను సంబంధిత బాధితులకు అందజేశారు. వివిధ గ్రామాలకు చెందిన బాధితులు తమ మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నట్లు గతంలో ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన CEIR పోర్టల్ కానిస్టేబుల్ లాల్ సింగ్, ఆ ఫోన్ల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి ట్రాక్ చేశారు. రికవరీ అయిన ఫోన్ల వివరాలు ఇలా ఉన్నాయి:దసర్వ శరత్ కుమార్ (నవాబుపేట): వివో ౧5 ప్రో (ఆగస్టు 2024లో పోగొట్టుకున్నారు) అనుప మహేష్ (నవాబుపేట): రెడ్మి నోట్ 12 ప్రో దువ్వల ప్రవీణ్ (నవాబుపేట): ఒప్పో మొబైల్ మేకల గణేష్ (శాంతినగర్): ఒప్పో మొబైల్ ఈ సందర్భంగా ఎస్సై శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ, ఫోన్లు పోగొట్టుకున్న వారు వెంటనే అధైర్యపడకుండా పోలీస్ స్టేషన్‌లో లేదా CEIR (Central Equipment Identity Register) పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న అత్యాధునిక టెక్నాలజీతో మొబైల్ ఫోన్లను సులభంగా గుర్తించవచ్చని ఆయన తెలిపారు. ఎవరికైనా ఇతరుల మొబైల్ ఫోన్లు దొరికితే వెంటనే పోలీసులకు అప్పగించాలని, వాటిని అక్రమంగా వినియోగించడం నేరమని హెచ్చరించారు.దతమ ఫోన్లను తిరిగి పొందిన బాధితులు ఎస్సై మరియు కానిస్టేబుల్ లాల్ సింగ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# 23వ డివిజన్‌లో బిఆర్ఎస్‌దే గెలుపు

## ● విస్తృత ప్రచారంలో ధీమా వ్యక్తం చేసిన అభ్యర్థి అడ్డాకుల శారద







**ఖమ్మం ప్రతినిధి, ఫిబ్రవరి 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం జిల్లా, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 23వ డివిజన్ లో సిపిఎం బలపరిచిన బిఆర్ఎస్ అభ్యర్థి విస్తృత పర్యటనలో తన గెలుపే తథ్యం అని అడ్డాకుల శారద ధీమా వ్యక్తం చేశారు. ఏదులాపురం 23వ డివిజన్లో సిపిఎం కార్యకర్తలు, నాయకులు, తన బిఆర్ఎస్ సైన్యంతో అడ్డాకుల శారద గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అడ్డాకుల శారద మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రం సాధించిన బీఆర్ఎస్ పార్టీ ప్రజల గుండెల్లో ఎప్పటికీ స్థిరస్థాయిగా నిలిచి ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తానన్న ఆరు గ్యారెంటీలు అడుగంటి పోయాయని, ప్రజలు మరలా బిఆర్ఎస్ అధికారాన్ని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ పాలన ప్రజల్లో నమ్మకాన్ని కోల్పోయిందని తన గెలుపు తధ్యమని జోస్యం చెప్పారు. ఓటర్లు కారు గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించి 23వ డివిజన్ ప్రజలకు సేవ చేసుకునే అవకాశాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రజల సంక్షేమమే బిఆర్ఎస్ లక్ష్యం

## - ఏదులాపురం మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో కందాళ ఉపేందర్ రెడ్డి

## - 1వ వార్డులో బిఆర్ఎస్ అభ్యర్థి దుంపల నాగరాజును అత్యధిక మెజారిటీ తో గెలిపించండి









**ఖమ్మం ప్రతినిధి, ఫిబ్రవరి 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డులో సీపీఎం పార్టీ మద్దతుతో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న దుంపల నాగరాజును కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఆయన వార్డు పరిధిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ, బిఆర్ఎస్ పార్టీ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేసిన బిఆర్ఎస్‌కు మళ్లీ అవకాశం ఇవ్వాలని పిలుపునిచ్చారు.ఈ ప్రచార కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు మరియు ఎమ్మెల్సీ తాత మధుసూదన్, సీపీఎం పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు, సీపీఎం పార్టీ పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు తాళ్లూరి జీవన్ తదితరులు పాల్గొన్నారు.

# 30వ డివిజన్లో బిఆర్ఎస్ జెండా ఎగరాలి

**• అభ్యర్థి రామిశెట్టి విద్యావతి • 30వ వార్డులో సిపిఎం, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలలో అభ్యర్థి రామిశెట్టి విద్యావతి ఇంటింటా ప్రచారం**





**ఖమ్మం ప్రతినిధి, ఫిబ్రవరి 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం జిల్లా, ఏదులాపురం మున్సిపాలిటీ ఎన్నికల్లో 30వ డివిజన్ లో బిఆర్ఎస్ అభ్యర్థి రామిశెట్టి విద్యావతిని కారు గుర్తు పై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని డివిజన్ ఇన్చార్జి శంకర్ రాజు అన్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 30వ వార్డులో సీపీఎం పార్టీ బలపరిచిన బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రామిశెట్టి విద్యావతి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా డివిజన్ ఇంచార్జి శంకర్ రాజు, బిఆర్ఎస్ జిల్లా నాయకులు నర్సిరెడ్డి లు మాట్లాడుతూ.. బిఆర్ఎస్ పార్టీ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేసిన బిఆర్ఎస్‌కు మళ్లీ అవకాశం ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో సిపిఎం నాయకులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి విద్యుత్ సదస్సులు: ఎన్.వి వేణుగోపాల చారి



**హన్మకొండ,ఫిబ్రవరి 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** విద్యుత్తు వినియోగదారుల సమస్యలు పరిష్కరించడానికి ఫిర్యాదుల పరిష్కార వేదికలు నిర్వహిస్తున్నామని విద్యుత్తు వినియోగదారుల పరిష్కార వేదిక చైర్ పర్సన్ (సి జి ఎఫ్ -1) ఎన్. వి వేణుగోపాల చారి అన్నారు. హనుమ కొండ జిల్లా హసన్ పర్తి మండలం గురువారం ఎల్లాపూర్ గ్రామ సబ్ స్టేషన్ లో నిర్వహించిన సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై వినియోగదారులతో మాట్లాడి పలు సమస్యలు తెలుసుకుని వినతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగ దారులకు సేవలు అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదని, వినియోగదారుల ఇండ్లకు వెళ్లి సమస్యలను రెండు రోజులలో పరిష్కరించాలని సూచించారు. సమస్యలు నిర్దేశించిన సమయంలో పరిష్కరించకపోతే తగిన ఆధారాలతో వినియోగ దారుల ఫోరం దృష్టికి తెలపాలని సూచించారు. సమస్యలపై వినియోగ దారులు వాట్సాప్ పోస్ట్ ద్వారా ఫిర్యాదు చేస్తే పరిష్కరించేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ నెంబర్ కె.రమేష్, ఎన్ దేవేందర్ మెంబర్ ఫైనాన్స్ , ఇండిపెండెంట్ మెంబర్ఎస్ ఇ ఓ పి మధుసూదన్, డిఇఓపి మల్లికార్జున్, ఎస్ ఏ ఓ హెచ్ ఎన్ కే నవీన్, ఏడిఈ హసన్ పర్తి పి అశోక్, ఏఈ శిరీష్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కోర్టులో విధులు బహిష్కరించిన న్యాయవాదులు..



**కరీంనగర్ టౌన్ ఫిబ్రవరి 05(పిసిడబ్ల్యూ న్యూస్):** న్యాయ వాదుల ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ పిలుపుమేరకు చేవెళ్ల బార్ అసోసియేషన్ సభ్యురాలైన స్వప్న క్రూరమైన హత్యకు నిరసనగా గురువారం కరీంనగర్ జిల్లాకు న్యాయవాదులు తమ విధులను బహిష్కరించారు. జిల్లా కోర్టు ఆవరణలో కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు లింగంపల్లి నాగరాజు, కందుల అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో న్యాయవాదులు చేవెళ్ల బార్ అసోసియేషన్ సభ్యురాలైన స్వప్న మీద క్రూరమైన హత్య తీవ్రంగా ఖండిస్తూ నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలు తెలిపారు. నిందితున్నీ అరెస్టు చేసి, కటిన చర్యలు తీసుకోవాలని, వివాంట్ జస్టిస్, న్యాయ వాదులపై దాడులు అరికట్టాలని, వెంటనే అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకురావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వలను డిమాండ్ చేశారు. న్యాయ వాదులు జిల్లా కోర్టు నుండి డా బిఆర్ అంబేద్కర్ చౌరస్తా వరకు వెళ్ళి పెద్ద ఎత్తున ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయ వాదులు పెంచాల ప్రభాకర్ రావు, కూర శ్రీనివాస్ రెడ్డి, కల్లేపల్లి లక్ష్మయ్య,సొల్లు సత్యం, పెరుక రాజన్న, ముని వేణు గోపాల్, బూడిద మల్లేశ్, ప్రదీప్ కుమార్, భీమ సాహెబ్ లతో పాటు మహిళ న్యాయవాదులు ప్రియాంక, అశ్విని, మల్లీశ్వరి, నిషా సింగ్, శ్రావణి, రేణుక, మల్లికా, లావణ్య తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పరకాలలో నువ్వా నేనా అన్నట్లుగా సాగుతున్న మున్సిపల్ ఎన్నికలు

**• 22వ వార్డులో స్వతంత్ర అభ్యర్థిగా పోలు మహేశ్వర్ ఒంటరి పోరాటం**



**పరకాల, ఫిబ్రవరి 5 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాల పట్టణంలో మొత్తం 22 వార్డులు ఉండగా, ప్రతి వార్డులో ఎన్నికల పోరు నువ్వా నేనా అన్నట్లుగా ఉత్కంఠభరితంగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో 22వ వార్డులో స్వతంత్ర అభ్యర్థిగా పోలు మహేశ్వర్ బరిలోకి దిగుతూ ఒంటరి పోరాటం చేస్తున్నారు. ఆయన ఎన్నికల గుర్తు ఎయిర్ కండిషనర్. విద్యావంతుడైన మహేశ్వర్ గొప్ప చదువులు చదివిన వ్యక్తిగా, సమాజంపై స్పష్టమైన అవగాహన కలిగిన నాయకుడిగా ప్రజల్లో గుర్తింపు పొందుతున్నారు. ప్రజాసేవ చేయాలనే తపనతో స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల బరిలోకి దిగిన ఆయన, సామాజిక అంశాలపై చైతన్యం కలిగిన వ్యక్తిగా పేరు సంపాదించారు. వార్డులోని సమస్యలను గుర్తించి, వాటికి తక్షణ పరిష్కారాలు చూపే తెలివితేటలు తనకు ఉన్నాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. 22వ వార్డులో డ్రైనేజీ, రోడ్లు, తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు వంటి మౌలిక వసతుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడమే తన ప్రధాన లక్ష్యమని మహేశ్వర్ తెలిపారు. ప్రజలు తనను నమ్మి భారీ మెజారిటీతో గెలిపిస్తే, వార్డును అన్ని విధాల అభివృద్ధి పథంలో నడిపిస్తానని హామీ ఇచ్చారు. రాజకీయాలకు అతీతంగా, కేవలం ప్రజల సమస్యలే అజెండాగా పనిచేస్తానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా 22వ వార్డు ప్రజలు తన ఎన్నికల గుర్తు ఎయిర్ కండిషనర్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని పోలు మహేశ్వర్ కోరారు. నిజాయితీ, పారదర్శకతతో కూడిన పాలన అందించి, 22వ వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతానని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# పరకాల మున్సిపాలిటీ 18వ వార్డులో కాంగ్రెస్ పార్టీ బలమైన అభ్యర్థి జయమ్మ



**పరకాల, ఫిబ్రవరి 5 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాల పట్టణ మున్సిపాలిటీలో మొత్తం 22 వార్డులు ఉండగా, అందులో 18వ వార్డులో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా పంచగిరి జయమ్మ హరి ప్రసాద్ బరిలోకి దిగారు. గతంలో ఓటమి తెలియని నాయకురాలిగా, ప్రజల సమస్యలపై పోరాడే నాయకురాలిగా జయమ్మకు పరకాల పట్టణంలో ప్రత్యేక గుర్తింపు ఉంది. ప్రజలతో నేరుగా మమేకమై, వారి కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలిచిన నాయకురాలిగా ఆమె ప్రజాభిమానం సంపాదించారు. ప్రధాన రాజకీయ పార్టీల నుంచి ఎన్నో అవకాశాలు వచ్చినప్పటికీ, కాంగ్రెస్ పార్టీపై అపారమైన నమ్మకంతో, ఆ రోజు నుంచి ఈ రోజు వరకు అదే పార్టీలో కొనసాగుతూ ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తున్నారు. "కాంగ్రెస్ పార్టీ నా జీవితం" అంటూ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావిస్తూ ముందుకు సాగుతున్నారు. ఈ సందర్భంగా జయమ్మ మాట్లాడుతూ, ప్రజలకు సేవ చేయడమే తన జీవిత లక్ష్యమని, చనిపోయేంతవరకు ప్రజాసేవలో కొనసాగుతానని స్పష్టం చేశారు. 18వ వార్డు ప్రజలు తనను భారీ మెజార్టీతో గెలిపిస్తే, వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని తెలిపారు. మౌలిక సదుపాయాలు, పారిశుధ్యం, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ వంటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అలాగే తన వార్డు ప్రజలకు ఏ కష్టం వచ్చినా, ఎలాంటి ఆపద ఎదురైనా ముందుండి సేవ చేస్తానని, ప్రజల పక్షాన నిలబడే నాయకురాలిగా ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఆమె పేర్కొన్నారు. ప్రజల ఆశీస్సులతో 18వ వార్డులో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

# ప్రజల సంక్షేమంకోసం బిఆర్ఎస్‌ను గెలిపించండి



**- 29వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి వెంపటి మాధవి**

**- బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలలో అభ్యర్థి వెంపటి మాధవి ఇంటింటా ప్రచారం**

**ఖమ్మం ప్రతినిధి, ఫిబ్రవరి 5 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం జిల్లా, ఏదులాపురం మున్సిపాలిటీ ఎన్నికల్లో 29వ వార్డులో బిఆర్ఎస్ అభ్యర్థి వెంపటి మాధవి కారు గుర్తు పై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ డివిజన్ ఇన్చార్జి బిళ్ళగిరి ధనుంజయ్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 29వ వార్డులో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి వెంపటి మాధవి నాయకులు, కార్యకర్తలతో కలసి గురువారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ ఇంచార్జి బిళ్ళగిరి ధనుంజయ్, బిఆర్ఎస్ జిల్లా నాయకులు వెంపటి ఉపేందర్ లు మాట్లాడుతూ.. బిఆర్ఎస్ పార్టీ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేసిన బిఆర్ఎస్‌కు మళ్లీ అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు రెడ్డిమల్ల నరేందర్, పగిడిపల్లి బాబు, పుసులూరి బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు తదితరులు నాగమణి, బిఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లోని హామీ, బీసీ సబ్ ప్లాన్ బడ్జెట్‌లో ప్రకటించాలి

**• ప్రొఫెసర్ మురళీ మనోహర్ డిమాండ్**

**హన్మకొండ ఫిబ్రవరి 05(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర బడ్జెట్లో బీసీలకు'ప్రత్యేకంగా 'సబ్ ప్లాన్' ప్రకటించాలని బీసీ సబ్ ప్లాన్ సాధన కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ కె.మురళీ మనోహర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హన్మకొండ నక్కలగుట్ట లోని హరిత హోటల్ లో బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరుణహరి శేష అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు వెంటనే సబ్ ప్లాన్ అమలు చేయాలని కోరారు. రాబోయే బడ్జెట్లో బీసీల సంక్షేమం కోసం కనీసం 20 వేల కోట్ల రూపాయలు కేటాయించాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని, రిజర్వేషన్లు ఖరారు చేయకుండానే ఎన్నికలు నిర్వహించడం అన్యాయమని కేయూ బీసీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ గడ్డం కృష్ణయ్య విమర్శించారు. ద

ప్రొఫెసర్ ఎం.సారంగపాణి, ప్రొఫెసర్ గోపు సుధాకర్ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రవేశపెట్టిన 12 బడ్జెట్లలో బీసీలకు 3 శాతం కంటే తక్కువ నిధులు కేటాయించా రని, కేటాయించిన నిధులను కూడా పూర్తిస్థాయిలో ఖర్చు చేయడం లేదని మండిపడ్డారు. దీనివల్ల కుల వృత్తిదారులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంబీసీ నాయకులు డాక్టర్ పాలడుగుల సురేందర్ మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్వహించిన కులగణన నివేదికను. ఆయా కులాల వెనుకబాటుతనానికి సంబంధించిన పూర్తి వివరాలను వెంటనే బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. **సబ్ ప్లాన్ డ్రాఫ్ట్ విడుదల** ప్రొఫెసర్ కె.మురళీ మనోహర్ రూపొందించిన "బీసీ సబ్ ప్లాన్ డ్రాఫ్ట్"ను నాయకులు విడుదల చేశారు. బీసీ నాయకులు ఎదునూరి రాజమౌళి, ధారబోయిన సతీష్, డాక్టర్ ఎర్ర బొజ్జు రమేష్, డాక్టర్ కత్తెరశాల దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

PCW తెలుగు దినపత్రిక
శుక్రవారం 06 ఫిబ్రవరి 2026



# అట్లీ, అల్లు అర్జున్ మూవీ రష్మిక హీరోయిన్ అంటూ ప్రచారం

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా స్టార్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పాన్ వరల్డ్ చిత్రం ఎఎ22 ఇప్పటికే సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. సైన్స్ ఫిక్షన్ అడ్వెంచర్ జానర్‌లో రూపొందుతున్న ఈ మూవీ షూటింగ్ శరవేగంగా కొనసాగుతుండగా, దీనిపై అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్నంటు తున్నాయి. సినిమా గురించి చిన్న అప్‌డేట్ బయటకు వచ్చినా క్షణాల్లో వైరల్ అవుతోంది. తాజాగా ఈ చిత్రంలో నటించే హీరోయిన్‌ల గురించి మరో క్రేజీ న్యూస్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఇప్పటికే బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొనే ఈ సినిమాలో మెయిన్ హీరోయిన్‌గా నటిస్తున్న సంగతి తెలిసిందే. ఆమెతో పాటు మరో ముగ్గురు కథానాయికలు కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారని గత కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది జాన్వీ కపూర్, మృణాల్ ఠాకూర్, రష్మిక మందన పేర్లు ప్రముఖంగా వినిపించగా, ఇప్పుడు రష్మిక మందన నిజంగానే షూటింగ్‌లో జాయిన్ అయిందన్న వార్త మరింత హైప్ క్రియేట్ చేస్తోంది. ముంబైలో జరుగుతున్న షెడ్యూల్‌లో రష్మిక పాల్గొంటోందని, అల్లు అర్జున్, జాన్వీ కపూర్, 'కుబేర' ఫేమ్ జిమ్ సర్భ్‌లతో కలిసి కీలక సన్నివేశాల్లో నటిస్తోందని ఓ ఆంగ్ల మీడియా ఛానల్ వెల్లడించింది. దాదాపు నెల రోజుల పాటు కొనసాగే ఈ షెడ్యూల్‌లో యాక్షన్ ఎపిసోడ్స్‌తో పాటు ఎమోషనల్ సీన్స్ చిత్రీకరించనున్నట్లు సమాచారం. రమ్యకృష్ణ, యోగిబాబు వంటి ప్రముఖ నటీనటులు కూడా ఈ ప్రాజెక్ట్‌లో భాగమవుతున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇదే సమయంలో విజయ్ దేవరకొండ,రష్మిక మందన పెళ్లి వార్తలు కూడా సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతుండటంతో ఈ మూవీపై మరింత ఆసక్తి పెరిగింది. 'పుష్ప' సిరీస్‌లో అల్లు అర్జున్ , రష్మిక జంట బ్లాక్‌బస్టర్ హిట్ ఇవ్వడంతో ఈ కాంబో మళ్లీ రిపీట్ అవుతుందా అనే ఉత్కంఠ నెలకొంది. మరోవైపు ఈ చిత్రంలో రష్మిక నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించబోతుందన్న రూమర్స్ కూడా వినిపిస్తున్నాయి. ఇప్పటివరకు ఆమె కెరీర్‌లో చేయని సరికొత్త పాత్రలో, ఛాలెంజింగ్ రోల్‌లో కనిపించనుందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. యూనివర్స్ కాన్సెప్ట్‌తో విజువల్ వండర్‌గా తెరకెక్కుతుండగా, అల్లు అర్జున్ మల్టిపుల్ క్యారెక్టర్స్‌లో కనిపించనున్నట్లు సమాచారం.



# 'యానిమల్' సీక్వెల్‌పై అప్‌డేట్ ఇచ్చిన సందీప్ వంగా

రణ్‌బీర్ కపూర్ హీరోగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో వచ్చిన 'యానిమల్' సినిమా సృష్టించిన సంచలనం అంతా ఇంతా కాదు. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'యానిమల్ పార్క్' ఉంటుందని గతంలోనే ప్రకటించిన మేకర్స్, తాజాగా దానిపై ఓ కీలక అప్‌డేట్ ఇచ్చారు. ఈ సీక్వెల్ షూటింగ్ 2027లో మొదలుపెట్టి, 2028లో సినిమాను విడుదల చేస్తామని దర్శకుడు సందీప్ రెడ్డి వంగా స్పష్టం చేశారు.ప్రస్తుతం 'యానిమల్' చిత్రాన్ని జపాన్‌లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఫిబ్రవరి 13న ఈ సినిమా అక్కడ రిలీజ్ కానున్న నేపథ్యంలో హీరో రణ్‌బీర్ కపూర్, దర్శకుడు సందీప్ రెడ్డి ప్రమోషన్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జపాన్‌లోని అభిమానులతో ముచ్చటించిన సందీప్ రెడ్డి, 'యానిమల్' సీక్వెల్‌పై వస్తున్న ఊహాగానాలకు తెరదించారు. 'యానిమల్ పార్క్' కచ్చితంగా ఉంటుందని ఆయన పునరుద్ఘాటించారు. సినిమా షూటింగ్‌కు, విడుదలకు సంబంధించిన స్పష్టమైన ప్రణాళికను వెల్లడించడంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. 'యానిమల్' సాధించిన భారీ విజయంతో సీక్వెల్‌పై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. ఇప్పుడు దర్శకుడే నేరుగా టైమ్‌లైన్ ప్రకటించడంతో ఈ ప్రాజెక్ట్‌పై మరింత స్పష్టత వచ్చింది.

# 16 ఏళ్ల లోపు వారిని సోషల్ మీడియాకు దూరం చేయాలి

### అక్కాచెల్లెళ్ల మృతి ఘటనపై సోనూసూద్ ఆందోళన



సోషల్ మీడియా, ఆన్‌లైన్ గేమింగ్ వ్యసనం యువతను, చిన్నారులను పెను ప్రమాదంలోకి నెడుతున్న విషయం తెలిసిందే. ఇటీవలే ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో ఆన్‌లైన్ గేమింగ్ కారణంగా ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఆత్మహత్య చేసుకోవడం దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ విషాద ఘటనపై ప్రముఖ బాలీవుడ్ నటుడు, రియల్ హీరో సోనూ సూద్ తీవ్రంగా స్పందించారు. 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియాను నిషేధించాలని గతంలోనే కోరిన ఆయన.. ఈ తాజా ఘటన నేపథ్యంలో మరోసారి కేంద్ర ప్రభుత్వానికి తన విజ్ఞప్తిని బలంగా వినిపించారు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు.'ఘజియాబాద్‌లో ముగ్గురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. వారు హింసకో, పేదరికానికో బలవ్వలేదు.. ఆన్‌లైన్ గేమింగ్, డిజిటల్ వ్యసనం సృష్టించిన కనిపించని ఒత్తిడికి బలైపోయారు. నేను మళ్ళీ చెబుతున్నాను.. చదువు కోసం తప్ప, మిగతా అన్ని విషయాల్లో 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా, ఆన్‌లైన్ గేమింగ్‌లను నిషేధించాలి. బాల్యానికి కావాల్సింది సరైన మార్గదర్శకత్వం, ప్రేమ.. అంతే కానీ అల్గారిథమ్స్, స్క్రీన్లు కాదు. ఇది ఎవరినో నిందించడం కోసం కాదు, మన పిల్లలను కాపాడుకోవడం కోసం చేస్తున్న విజ్ఞప్తి. ఈ ఘటనను మరో వార్తగా చూసి మర్చిపోవద్దు.. ఇప్పుడైనా స్పందించాల్సిన సమయం ఆసన్నమైంది'. అంటూ సోనుసూద్

# 20 ఏళ్ల కల..

### వారణాసి లో క్యారెక్టర్ పై అక్కినేని హీరో క్లారిటీ!



అక్కినేని వారసుడిగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి, తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న నటుడు సుమంత్. విలక్షణమైన కథలను ఎంచుకుంటూ ప్రయాణిస్తున్న ఆయన, తాజాగా తన మనసులోని మాటను ఓ ఇంటర్వ్యూలో బయటపెట్టారు. ముఖ్యంగా గ్లోబల్ డైరెక్టర్ రాజమౌళి, తన ప్రాణమిత్రుడు మహేష్ బాబు కాంబినేషన్‌లో రాబోతున్న భారీ చిత్రం 'వారణాసి' గురించి సుమంత్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారాయి. ఈ ప్రాజెక్ట్‌లో సుమంత్ పాత్ర ఉండబోతుందా? వివరాలు ఇలా వున్నాయి..సుమంత్ కెరీర్ ప్రారంభం నుండి వైవిధ్యమైన సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తూనే ఉన్నారు. అయితే, ఆయనకు ఒక తీరని కోరిక ఉందట. అదే దిగ్గజ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో నటించడం. సుమారు 20 ఏళ్ల క్రితమే, రాజమౌళిని కలిసి, ఆయన సినిమాల్లో చిన్న పాత్ర ఉన్నా చేయడానికి సిద్ధమని తన ఆసక్తిని వ్యక్తం చేశారట. అంతేకాక ఎవరైనా డైరెక్టర్ తనకు నచ్చితే వాళ్ళ దగ్గరకు వెళ్లి మీ సినిమాలో ఏదైనా ఛాన్స్ ఉంటే ఇవ్వండి అని తానే స్వయంగా వెళ్లి అడుగుతాను అని ఆయన తెలిపారు. ఇక రాజమౌళి సృష్టించే విజువల్ వండర్స్ అంటే తనకు ఎంతో గౌరవమని, ఆయన పనితీరును తాను ఎప్పుడూ ఆరాధిస్తూనే ఉంటానని సుమంత్ ఈ ఇంటర్వ్యూలో గుర్తుచేసుకున్నారు.మహేష్ బాబు, సుమంత్ మధ్య ఉన్న స్నేహం గురించి టాలీవుడ్‌లో అందరికీ తెలిసిందే. మహేష్ బాబు తనకు కేవలం మిత్రుడు మాత్రమే కాదని, తెలుగు చిత్ర పరిశ్రమలో తనకు అత్యంత ఇష్టమైన నటుడు అని సుమంత్ తెలిపారు. ఇప్పుడు రాజమౌళి-మహేష్ బాబు కాంబోలో రాబోతున్న 'వారణాసి' చిత్రంపై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు ఉన్నాయి. ఈ భారీ అడ్వెంచర్ చిత్రంలో తానూ భాగం కావాలని ఎవరికి ఉండదు అని ప్రశ్నిస్తూనే, ఆ ప్రాజెక్ట్ కోసం తాను కూడా ఒక సామాన్య అభిమానిలా ఎదురుచూస్తున్నట్లు సుమంత్ తెలిపారు.

# సీతైనా.. సుమతైనా.. ఆమే



గ్లామర్ షోతో మెప్పించే హీరోయిన్స్ కి ఒక టైం దాటాక ఛాన్స్ లు వస్తాయన్న గ్యారెంటీ లేదు కానీ తమ అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకునే కథానాయికలకు మాత్రం ఎప్పటికీ డిమాండ్ ఉంటుంది. కొంతమంది హీరోయిన్స్ ముందు గ్లామర్ విషయంలో మొహమాట పడినా అవకాశాలు లేని టైం లో స్కిన్ షో చేయక తప్పదని భావిస్తారు కానీ మరికొంతమంది భామలైతే అవకాశాలు లేకపోయినా పర్లేదు కానీ గ్లామర్ షో చేసేది లేదని ఫిక్స్ అవుతారు. అలాంటి వారు తమ ప్రతిభతో ప్రేక్షకులను మెప్పిస్తూ వస్తారు. అలాంటి హీరోయిన్స్ లిస్ట్ లో సాయి పల్లవి ఉంటుంది. మళయాళ ప్రేమమ్ సినిమాతో పాపులారిటీ తెచ్చుకున్న సాయి పల్లవి ఫిదాతో తెలుగు తెరకు పరిచయమైంది. అప్పటి నుంచి తెలుగులో సాయి పల్లవి సినిమా అంటే చాలు ఆడియన్స్ సూపర్ ఎగ్జైట్ అవుతారు. కొత్త పాత్రలతో సాయి పల్లవి సినిమా సినిమాకు తన మీద అంచనాలు పెరిగేలా చేసుకుంది. కథల ఎంపికలో ఆమె తీసుకునే నిర్ణయాలే ఆమెకు ఈ పాపులారిటీని తీసుకొచ్చాయి.సినిమాలు ఎన్ని చేశామన్నది కాదు ఎంతమంది ప్రేక్షకులకు దగ్గరయ్యామన్న ఆలోచనతో సాయి పల్లవి ప్రాజెక్ట్ ల కమిట్మెంట్ ఉంటుంది. సౌత్ లో ఆమె క్రేజ్ ని చూసిన బాలీవుడ్ మేకర్స్ అక్కడ ఆమెకు వరుస అవకాశాలు ఇస్తున్నారు. తెలుగులో తండేల్ తర్వాత సాయి పల్లవి నెక్ట్స్ సినిమాకు సైన్ చేయలేదు. హిందీలో రామాయణ తో పాటు ఏక్ దిన్ ప్రాజెక్ట్ లతో బిజీగా ఉంది ఈ అమ్మడు.ఇక లేటెస్ట్ గా మన రెబల్ స్టార్ ప్రభాస్ కల్కి 2898 ఏడి సీక్వెల్ లో కూడా సాయి పల్లవి సెలెక్ట్ అయ్యిందని తెలుస్తుంది. కల్కి పార్ట్ 1లో దీపిక పదుకొనె చేసిన సుమతి రోల్ కి ఆమె ప్లేస్ లో సాయి పల్లవిని రీప్లేస్ చేస్తున్నారు. ఓ పక్క సీతమ్మ పాత్రలో సాయి పల్లవి పెర్ఫార్మెన్స్ కోసం ఆమె ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తుండగా ఆ క్రేజీ ప్రాజెక్ట్ తో పాటు కల్కి 2 లో సాయి పల్లవి ఎంట్రీ మరింత ఎగ్జైటింగ్ గా ఉంది.సినిమాల విషయంలో తనకు వచ్చే ఛాలెంజింగ్ రోల్స్ ని యాక్సెప్ట్ చేస్తూ ప్రేక్షకులు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిజం చేస్తూ మరింత క్రేజ్ సంపాదిస్తుంది సాయి పల్లవి. నెక్ట్స్ రాబోతున్న భారీ సినిమాలతో సాయి పల్లవి పేరు పాన్ ఇండియా లెవెల్ లో మారుమోగిపోతుందని చెప్పడంలో సందేహం లేదు. టాలీవుడ్ లో స్టార్ క్రేజ్ తో ఫాం కొనసాగిస్తున్న సాయి పల్లవి ప్రస్తుతం కమిటైన సినిమాలు చేసిన తర్వాత ఆమె రేంజ్ మరింత పెరిగే అవకాశం ఉంది. రామాయణం, కల్కి 2 సినిమాలు సాయి పల్లవి కెరీర్ లో స్పెషల్ ప్రాజెక్ట్స్ గా మిగిలిపోతాయని చెప్పొచ్చు. దీపిక ప్లేస్ లో సాయి పల్లవి ఆమెను మర్చిపోయేలా చేయగలిగితే మాత్రం అమ్మడు నెక్ట్స్ లెవెల్ రేంజ్ సంపాదించే అవకాశం ఉంది.

# నేటి నుంచి ఓటిటిలోకి రాజాసాహెబ్




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా, దర్శకుడు మారుతి కాంబినేషన్‌లో వచ్చిన క్రేజీ హారర్-కామెడీ మూవీ 'ది రాజాసాబ్' ఓటీటీలోకి రాబోతున్న విషయం తెలిసిందే. ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చి మిక్స్‌డ్ టాక్ తెచ్చుకున్న ఈ చిత్రం విడుదలైన నెల రోజుల్లోపై ఓటీటీ అనౌన్స్‌మెంట్‌ను పంచుకుంది. ప్రముఖ ఓటీటీ సంస్థ జియో హాట్‌స్టార్ అత్యంత భారీ ధరకు ఈ సినిమా హక్కులను సొంతం చేసుకోగా.. ఫిబ్రవరి 6 నుంచి ఈ సినిమా జియో హాట్‌స్టార్‌లో తెలుగుతో పాటు తమిళం, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. అయితే ఓటీటీ వెర్షన్‌కి సంబంధించి గుడ్ న్యూస్ తెలిపింది చిత్రయూనిట్. ఈ సినిమా ఎక్సెటెండెడ్ కట్‌తో ఓటీటీలోకి రాబోతున్నట్లు ప్రకటించింది. దీంతో థియేటర్‌లో మిస్ అయిన ప్రేక్షకులకి ఇది గుడ్ న్యూస్ అని చెప్పవచ్చు. ప్రభాస్‌ను వింటేజ్ లుక్‌లో చూపిస్తూ మారుతి తెరకెక్కించిన ఈ చిత్రంలో సంజయ్ దత్, మాళవిక మోహనన్, నిధి అగర్వాల్ ముఖ్య పాత్రలు పోషించారు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. రాజు అలియాస్ రాజాసాబ్ (ప్రభాస్)కు అమ్మానాన్న అన్నీ నాయనమ్మ గంగాదేవి(జరీనా వహాబ్)నే. గంగాదేవికి ఆల్జీమర్స్. ప్రతి విషయాన్ని మర్చిపోతుంటుంది. కాకపోతే ఎప్పుడో తనని విడిచిపెట్టి వెళ్ళిపోయిన భర్త కనకరాజు (సంజయ్‌దత్)ని మాత్రం గుర్తుపెట్టుకుంటుంది. తాత కనకారాజు కోసం వెదుకుతున్న రాజుకు కొన్ని సంచలన నిజాలు తెలుస్తాయి. నర్సాపూర్ అడవిలోని ఓ రాజమహల్ వున్నాడనే సంగతి తెలుసుకుంటాడు. ఆ రాజమహల్ అడుగుపెట్టిన రాజుకి ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయి ? కనకరాజు గురించి ఎలాంటి నిజాలు తెలుసుకున్నాడు? అసలు గంగాదేవి గతం ఏమిటి? కనకరాజు గంగాదేవిని ఎందుకు వదిలివెళ్ళిపోయాడు? తన లక్ష్యం ఏమిటి? నాయనమ్మ కోసం రాజు ఎలాంటి పోరాటం చేశాడనేది మిగతా కథ.